తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 22.08.2026 | సంపుటి : 13 సంచిక : 33 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




హైదరాబాద్

హైదరాబాద్ వేదికగా జాతీయ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్‌క్లబ్ ఆవిర్భావం

# గంగా - జమున తహజీబ్

## విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం





- జెన్ జీ పై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించాలి
- సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలి
- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్(జనంసాక్షి):**డిజిటల్ యుగంలో వేగం కంటే వార్తలో వాస్తవికత, నిష్పక్షపాతం , విశ్వసనీయతే అత్యంత ముఖ్యమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. "ముందు నిజ నిర్ధారణ చేయాలి.. ఆ తర్వాతే వార్తను ప్రసారం చేయాలి" అని ఆయన జర్నలిస్టులకు సూచించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్ తాజ్‌కృష్ణలో నిర్వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తొలి జాతీయ సదస్సును గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం మాత్రమే కాదని, సమాజానికి కళ్లు, చెవులు, ప్రజల గొంతుక అని గవర్నర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక భద్రత, వృత్తిపరమైన అభివృద్ధికి ఫెడరేషన్ దోహదపడాలని ఆకాంక్షించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు జర్నలిజానికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని, అదే సమయంలో డీప్‌ఫేక్స్, ఏఐ రూపొందించిన వీడియోలు, తప్పుడు సమాచారంతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. సోషల్ మీడియా ప్రభావంతో జెన్?జీ ఆలోచనా విధానం మారుతోంది ? యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అన్నారు. వేగం కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం అని పేర్కొన్న గవర్నర్ సోషల్ మీడియా ట్రెండ్స్, ఫేక్ న్యూస్‌కు లోనుకాకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలనీ జర్నలిస్టులను కోరారు. సంచలనాత్మకత, వైరల్ కంటెంట్

మిగతా 2లో..



- 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ విద్యావేత్తలతో సీఎం సమగ్ర చర్చలు
- తెలంగాణ యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులు
- సోమర్‌విల్ కాలేజీలో ఇందిరా చిత్రపటాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి

## తెలంగాణలో విద్యా కార్యక్రమాలు

# పెద్దఎత్తున చేపట్టండి

### ఆక్స్‌ఫర్డ్ వర్సిటీకి సీఎం రేవంత్ ఆహ్వానం

**లండన్(జనంసాక్షి):**తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని... లండన్ లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ ఆహ్వానం పలికారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత లండన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శిం చారు. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను వారికి సమగ్రంగా వివరించా రు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేం దుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్య క్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరా బాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు,

మిగతా 2లో..

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## అమెరికా వెళ్లొద్దు

- ముఖ్యమంత్రి పర్యటనకు అనుమతివ్వని కేంద్రం
- యూకే పర్యటనకు మాత్రమే విదేశాంగశాఖ ఒకే..
- రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం
- అందుకే అమెరికా వెళ్లేందుకు సీఎం రేవంత్‌కు అనుమతి ఇవ్వలేదు
- వివరణ ఇచ్చిన విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్

2లో..

## దిగ్భ్రాంతికి గురిచేసింది

- రాజకీయ కోణంలోనే అనుమతి నిరాకరించారు
- తెలంగాణకు ప్రపంచస్థాయి సంస్థలను తీసుకురావటమే నా ఉద్దేశం
- యూఎస్ పర్యటనకు కేంద్రం అనుమతించకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి
- అమెరికా పర్యటన యథాతథంగా కొనసాగించాలని అధికారులకు ఆదేశం



## రాయదుర్గం @ రూ.264 కోట్లు

నగరంలోని రాయదుర్గంలో ఎకరం భూమి రికార్డు ధర పలికింది. పాన్‌మక్తాలో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. మొత్తం 5.25 ఎకరాలనూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్‌లో మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. వేలంలో కనీస ధర రూ.175 కోట్లు, డిపాజిట్ రూ.10కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించింది. బిడ్డర్లు డిపాజిట్ చెల్లించి ఆన్‌లైన్ వేలంలో పాల్గొన్నారు. ఖరీదైన భూమి కావడంతో స్థిరాస్తి సంస్థలు పోటీపడి బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరికి ఎంఎస్ఎన్ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని దక్కించుకుంది.

### రాయదుర్గం భూముల వేలానికి

## తొలగిన అడ్డంకి

కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకణ
హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు సూచన

2లో..

### గీత దాటిన వారిపై

# వేటు వేయాలి

### సీఎల్‌పీ డిమాండ్

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సుస్మిత వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని, అది పూర్తిగా ఆమె సొంత అభిప్రాయమంటూ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బాలు నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి స్పందిస్తూ.. కొండా సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మామూలే అని.. సొంత పార్టీ వాళ్లు విమర్శలు చేస్తే ఎలా అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎత్తిన జెండాను దించకుండా పార్టీని అధికారంలోకి తెచ్చింది రేవంత్ అని.. ఆయనపైన విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. సుస్మిత వ్యాఖ్యలపై కొండా సురేఖ స్పందించాలని డిమాండ్ చేశారు. కష్టపడుతున్న సీఎంపై బండలేస్తారా అంటూ మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే సీఎంపై విమర్శలు చేయడం బాధాకరమని ఐలయ్య అన్నారు. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. కొండా సురేఖ భాష.. పార్టీని ఇబ్బంది పెడుతోందని.. సమంత విషయంలో కూడా ఇలాగే మాట్లాడారని మండిపడ్డారు. 'మీ తప్పుడు భాషకు సీఎం మూల్యం చెప్పించాలా? మీ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం పార్టీ బలి కావాలా? అధికారంలోకి రావడానికి రేవంత్ చెమట

మిగతా 2లో..

## చెప్పాల్సింది కమిటీకి చెప్పా..

సీఎం వచ్చాక మాట్లాడతా: కొండా సురేఖ

2లో..

### పెల్లెట్ గన్ బాధితుడికి

# న్యాయం చేయండి




### ఢిల్లీలో రాహుల్ గాంధీ ధర్నా

కాంగ్రెస్ అగ్రనేత నిరసనతో ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సమయంలో పోలీసులు పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. పెల్లెట్లు తగిలి గాయపడిన సాహిల్ అనే యువకుడితో కలిసి రాహుల్ శుక్రవారం మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తిరస్కరించడంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ బయట ధర్నాకు దిగారు. ఈ విషయంపై ఈ నెల 17న మెయిల్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకూ అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. రాహుల్ వెంట ప్రియాంకా గాంధీతోపాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఈ ధర్నాలో పాల్గొన్నాయి. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 'సాహిల్ శరీరంలో 200కు పైగా పెల్లెట్స్ షెల్స్ ఉన్నాయి. వాటిలో మూడు కంట్లోకి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ నిరసనల్లో పెల్లెట్

మిగతా 2లో..



### ప్రముఖ సినీనటి షావుకారు జానకి

## ఇకలేరు

వృద్ధాప్య సంబంధిత సమస్యలతో చికిత్స పొందుతూ మృతి
- ప్రముఖుల సంతాపం

**చెన్నై(జనంసాక్షి):**ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆమె గత కొంత కాలంగా శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మరోసారి తీవ్ర అస్వస్థతకు

మిగతా 2లో..

### కుమారుడిని కాపాడబోయి

## తండ్రి మృతి..

- ఇరువురి మరణం చూసి తట్టుకోలేక తానూ దూకేసిన తల్లి
- మహారాష్ట్ర ఛత్రపతి శంభాజీ నగర్‌లో విషాదం

### బౌద్ధ ఆశ్రమంపై

## సైనిక దాడి

14 మంది మృతి.. మయన్మార్‌లోని సాగైంగ్ ప్రాంతంలో

## భారత్‌లో పర్యటనపై బంగ్లా ప్రధాని సందిగ్ధం!

వివరాలు లోపలి పేజీల్లో..

## మరుగుదొడ్డి శుభ్రం చేసిన జూపల్లి



### అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి

తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తహసీల్దార్ కార్యాలయంలో వాష్‌రూమ్ శుభ్రం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. తహసీల్దార్ ఆఫీస్‌కి వచ్చారు. ఈ క్రమంలో అక్కడి వాష్‌రూమ్‌ను పరిశీలించారు. అది అపరిశుభ్రంగా ఉండటంతో మంత్రి స్వయంగా నీళ్లు చల్లి శుభ్రం చేశారు. ప్రభుత్వ కార్యాలయం ఇలా ఉంటే ఎలా? అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భారతీయులున్న నౌకపై ఇరాన్ కాల్పులు

22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్

2లో..

## పాక్‌తోనే తక్షణ ముప్పు

చైనాతోనే దీర్ఘకాల పోటీ
ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22.08.2026

## గీత దాటిన వారిపై వేటు వేయాలి

చుక్కలు త్యాగం చేశారు. ముఖ్యమంత్రిని వీక్ చేయాలనే కుట్ర చేస్తున్నారు. పార్టీలో జరుగుతున్న వ్యవహారంపై స్పందిస్తున్నాం. సీఎంపై ఎవరు తప్పుగా మాట్లాడినా చర్యలు తీసుకోవాలి. సీఎం నిర్ణయాలను తప్పు పట్టడం దుర్మార్గం. ఆయన నిర్ణయాలు తప్పు పట్టేవాళ్లు పార్టీలో ఉండాల్సిన అవసరం లేదు. సొంత పార్టీ నేతలు ప్రతిపక్షాలకు గొంతు ఇస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారిన వారిని పక్కన పెట్టాలి. పార్టీ వేదికలపై మాట్లాడాల్సిన విషయాలను బహిరంగంగా మాట్లాడతారా? మైక్ దొరికితే ఊగిపోతారా? సీఎంపై అసత్య ఆరోపణలు చేసినా, ఏకవచనంతో మాట్లాడితే ఊరుకోం' అని హెచ్చరించారు. పార్టీకి వ్యతిరేకంగా రాజ్‌గోపాల్ రెడ్డి మాట్లాడినా, బాలు నాయక్ మాట్లాడినా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి అయిపోయిందని అనుకోవద్దని.. కులం, హోదాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల కుట్రను సొంత పార్టీ వాళ్లు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌ను బలహీన పర్చాలని చూస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి కారణం రేవంత్ అని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బాలు నాయక్ ధీమా వ్యక్తం చేశారు. కొండా సురేఖపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏ పార్టీలోకి వెళ్తే ఆ పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా అని ప్రశ్నించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని వదిలి పోయారని.. వెళ్లేప్పుడు బీఫారంలు తీసుకొని వెళ్లిపోయారని విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేసి ప్రతిపక్షాలకు ఆయుధం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వంలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది త్యాగాన్ని వృథా చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసిన వారిపై నిర్ణయాలు కఠినంగా తీసుకోవాలన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకొని ఏమైనా చేస్తామంటే కుదరదన్నారు. డూప్లికేట్ మనుషులు.. ఒరిజినల్ కాంగ్రెస్ అని మాట్లాడుతున్నారని. ఏమైనా ఉంటే అధిష్ఠానం దగ్గర తీర్చుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో సురేఖ నియోజకవర్గంలో మెజారిటీ తగ్గిందన్నారు. పార్టీ నుంచి బహిష్కరించే ముందే వెళ్లిపోవాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హితవు పలికారు.

## చెప్పాల్సింది కమిటీకి చెప్పా..

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను"అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## కుమారుడిని కాపాడబోయి తండ్రి మృతి..

ముంబై(జనంసాక్షి):ఆత్మహత్య చేసుకోబోతున్న కొడుకును కాపాడబోయి కుటుంబం మృత్యువుబారిన పడిన విషాద ఘటన మహారాష్ట్ర లోని ఛత్రపతి శంభాజీ నగర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జల్తా ఫాటా ప్రాంతానికి చెందిన 19ఏళ్ల యువకుడు కునాల్ చంద్‌గుడే మొబైల్ ఫోన్ విషయంలో శుక్రవారం తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. అనంతరం ఆత్మహత్య చేసుకుంటానని వారిని బెదిరించి, ఉదయం 10గంటల సమయంలో ఖ్వా కొండ వద్దకు చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న అతడి తల్లిదండ్రులు మురళీధర్ (48), సంగీత కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అతడికి నచ్చజెప్పడానికి వారు దాదాపు 3గంటల పాటు ప్రయత్నం చేశారు. దగ్గరకు వస్తే దూకేస్తానని వారిని బెదిరించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కిందకు రావాలని యువకుడికి ఎంత నచ్చజెప్పినా వినిపించుకోలేదు. అతడిని కాపాడడానికి కింద వల ఏర్పాటు చేస్తే.. మరో అంచుకువెళ్లి బెదిరింపులకు పాల్పడ్డాడు. వేరేదారి లేక అతడి తండ్రి కూడా కొండపైకి ఎక్కి.. యువకుడిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. పట్టుతప్పడంతో ఇద్దరూ కొండ అంచు నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హఠాత్పరిణామంతో షాక్‌కు గురైన ఆ యువకుడి తల్లి కూడా కొండపై నుంచి దూకేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించినట్లు చెప్పారు.

### భారతీయులున్న నౌకపై ఇరాన్ కాల్పులు..

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తోన్న నౌకలు తరచూ దాడులకు గురవుతున్నాయి. ముఖ్యంగా యుద్ధం తీవ్రంగా ఉన్న తొలి నెలల్లో భారతీయులున్న పలు ట్యాంకర్లపై క్షిపణి దాడులు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో ఓ ఘటనకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఏప్రిల్ 22 నాటి దాడి దృశ్యాలను భారత నావికుల సమాఖ్య అయిన ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది.నాడు పనామా జెండాతో ఉన్న కంటైనర్ షిప్‌పై ఇరాన్ ఐఆర్‌జీసీ దాడి చేసింది. చిన్న బోట్లతో ఈ నౌకను చుట్టుముట్టి కాల్పులు జరిపిన దృశ్యాలు వీడియోలో కన్పించాయి. ఐఆర్‌జీసీ దళాలు రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్‌లను కూడా ప్రయోగించడంతో నౌకలోని సిబ్బంది ఒకింత భయాందోళనకు గురయ్యారు. కాల్పుల నుంచి తప్పించుకునేందుకు వారంతా కంటైనర్ మధ్యలో దాక్కొన్న దృశ్యాలు కన్పించాయి. ఈ నౌకలో మొత్తం 22 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 21 మంది భారతీయులే.ఈ వీడియోను ప్రధాని కార్యాలయం, కేంద్ర విదేశాంగ శాఖ, షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు నావికుల యూనియన్ ట్యాగ్ చేసింది. హర్మూజ్‌లో పరిస్థితి అంచనాలకు మించి ప్రమాదకరంగా ఉందని రాసుకొచ్చింది. కాగా.. ఈ నౌకలోని సిబ్బంది అంతా సురక్షితంగానే బయటపడ్డారని ఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఘటనపై ఇరాన్ వద్ద తమ ఆందోళనలను కూడా వ్యక్తం చేసింది.హర్మూజ్ ఘటనల్లోనూ మన నావికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఐరాస నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 28 తర్వాత నుంచి హర్మూజ్‌లో జరిగిన దాడుల్లో కనీసం 15 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధికులు భారతీయులే కావడం గమనార్హం. సముద్రంలో విధులు నిర్వర్తించే వారిలో ఎక్కువగా భారతీయులే ఉంటున్న సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నావికుల్లో దాదాపు 12.2శాతం మంది మన వాళ్లే.

**22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్**

యెమెన్, సోమాలియా తీరాల్లో వేర్వేరు ఘటనల్లో.. 22 మంది భారతీయులతో ప్రయాణిస్తోన్న రెండు వాణిజ్య నౌకలను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు ఈ విషయాన్ని సోమాలియా షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆగస్టు 17న సోమాలియా తీరంలో కామెరూన్ పతాకంతో వెళ్తోన్న 'లుటుఫ్' అనే కార్గో నౌక హైజాక్ అయ్యింది. తుర్కియే ఆయుధాలను తరలిస్తోన్న ఆ నౌకలో 10 మంది సిబ్బంది ఉండగా.. వారిలో ఆరుగురు భారతీయులు కాగా.. మిగిలిన వారు తుర్కియే, జార్జియా, సెర్బియాకు చెందినవారు. మొగదిషూలోని సైనిక శిక్షణా కేంద్రానికి ఆయుధాలు, కమ్యూనికేషన్, శాటిలైట్ పరికరాలను తరలిస్తుండగా.. సోమాలియా తీరంలో రెండు చిన్న పడవల నుంచి 8మంది సాయుధులు నౌకలోకి ప్రవేశించి హైజాక్ చేశారు.



## హైదరాబాద్.. గంగా-జమున తహజీబ్

కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొనేందుకు డిజిటల్ లిటరసీ, ఏఐ లిటరసీ, ఫ్యాక్ట్ చెకింగ్ వంటి అంశాలపై ఫెడరేషన్ అవగాహన పెంచాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, మీడియా, సాంకేతిక సంస్థలు, పౌరులందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.'నశా ముక్త్ భారత్', 'టీబీ ముక్త్ భారత్' వంటి జాతీయ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. తమ రచనలు, వార్తా సంస్థలు, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జర్నలిస్టులను కోరారు .ఫెడరేషన్ రాజకీయాలకు అతీతంగా సమ్మిళిత, ప్రజాస్వామ్య వేదికగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు. జాతీయ సదస్సు భారతీయ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసి, విశ్వసనీయంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగు ణంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. రమేష్, 'ద హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్. రామ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ లాహిరీ పాల్గొన్నారు.

## పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయండి



గన్స్ ఉపయోగించలేదని కేంద్రమంత్రులు, పోలీసులు చెబుతున్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై ఇటువంటి క్రూర చర్యలు చట్టవిరుద్ధం మాత్రమే కాదు.. తీవ్రమైన నేరం కూడా. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి.. వారిపై కేసు నమోదు చేయాలి. సాహిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి' అని రాహుల్ డిమాండ్ చేశారు.జంతర్‌మంతర్ వద్ద నిరసనల సమయంలో విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులు, భద్రతా బలగాలు వారిపై పెల్లెట్ గన్‌లను వినియోగించారని రాహుల్ గాంధీ వెల్లడించారు. అవి తగిలి గాయపడిన విద్యార్థితో మీడియా సమావేశం సైతం నిర్వహించారు. ఇంత జరిగినా ఈ విషయాన్ని పోలీసులు పట్టించుకోవట్లేదని.. దాడి చేసిన సిబ్బందిపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు.

ఫలించిన రాహుల్ పోరాటం

కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ విపక్షనేత రాహుల్ గాంధీ పోరాటం ఫలించింది. రాహుల్ పోరాటానికి కేంద్రం మెడలు వంచింది. రాహుల్ ధర్నాకి తలొగ్గిన ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ దగ్గర సీజేపీ చలో పార్లమెంట్ నిరసనల్లో పెల్లెట్ గన్ కాల్పులపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జులై 20న విద్యార్థులు చలో పార్లమెంట్ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ ప్రయోగించారు. సాహిల్ లోచబ్ అనే నిరసనకారుడు పెల్లెట్ గన్ కాల్పుల వల్ల తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో సాహిల్ లోచబ్ శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆశ్రయించాడు. రాహుల్ గాంధీ స్వయంగా సాహిల్, అతని కుటుంబ సభ్యులను తీసుకుని స్టేషన్?కు వెళ్లి బాధితుడి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. కానీ పోలీసులు కేసు రిజిస్టర్ చేసేందుకు ఒప్పుకోలేదు. దీంతో రాహుల్ గాంధీ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగాడు. బాధితుడి శరీరంలో 200కు పైగా పె÷-లలెట్ షెల్స్ ఉన్నాయని.. ఒక కంటి చూపు కోల్పోయినప్పటికీ కేసు నమోదు చేయరా అని పోలీసులు, కేంద్ర ప్రభుత్వం ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ధర్నాకు సంఘీభావంగా కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్టేషన్ దగ్గరకు చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని రాహుల్ తెగేసి చెప్పాడు. కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసనలు, రాహుల్ గాంధీ పట్టుబట్టడంతో ఎట్టకేలకు దిగొచ్చిన ఢిల్లీ పోలీసులు బాధితుడు సాహిల్ లోచబ్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు.

## పాక్‌తోనే తక్షణ ముప్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాద నిర్మూలన దృష్ట్యా భారత్ ఇప్పటికైతే పాకిస్థాన్‌ను తక్షణ ముప్పుగా చూస్తోందని.. అందుకే ఆ దేశంపై ప్రధానంగా దృష్టి సారించిందని ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె అన్నారు. కానీ, మన దేశానికి అనేక రంగాల్లో దీర్ఘకాలిక పోటీదారు మాత్రం చైనానే అని పేర్కొన్నారు. తన కొత్త పుస్తకం 'ది క్యూరియస్ అండ్ ది క్లాసిఫైడ్: అన్‌ఎర్తింగ్ మిలిటరీ మిథ్స్ అండ్ మిస్టరీస్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు."పాకిస్థాన్, చైనాతో మన దేశం యుద్ధాలు చేసింది. వాటితో సరిహద్దు వివాదాలూ ఉన్నాయి. అందువల్ల వాటిపై మనం దృష్టి సారిస్తూనే ఉంటాం. కానీ, ఈ రెండు దేశాలు పూర్తిగా భిన్నమైనవి. పాక్, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లలో తేడా ఉంటుంది. ప్రస్తుతానికి పాక్ నుంచి ఉగ్రవాద ముప్పు కొనసాగుతున్నందున ఆ దేశంపై భారత్ తక్షణ దృష్టి సారించింది. కానీ, దీర్ఘకాలంలో చైనా మనకు ప్రధాన పోటీదారు కాబోతోంది. రాజకీయం, ఆర్థికం, వాణిజ్యం, సైనిక వ్యవహారాల్లో భారత్-చైనా పరస్పరం పోటీపడనున్నాయి. ఇలాంటి పోటీ ఉన్నప్పుడు ఇరు దేశాల మధ్య కొన్ని ఘర్షణలు ఉండటం సహజమే. అందువల్ల బలమైన సైనిక ప్రతిఘటనను ఇస్తూనే.. చైనాతో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి" అని జనరల్ నరవణె వివరించారు.

## ప్రముఖ సినీనటి షావుకారు జానకి ఇకలేరు

గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె కన్నుమూశారు.షావుకారు జానకి.. నటి కృష్ణకుమారికి సోదరి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 1950లో 'షావుకారు' సినిమా హిట్ కావడంతో ఆమెకు షావుకారు జానకిగా పేరు వచ్చింది. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ చిత్రాల్లో జానకి నటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ సినిమాల్లోనూ, ఒక మలయాళ చిత్రంలో నటించి మెప్పించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.'వద్దంటే డబ్బు', 'కన్యా శుల్కం', 'పిచ్చి పుల్లయ్య' , 'రేచుక్క-పగటిచుక్క', 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్ళు', 'బాబు బంగారం', 'గీతాంజలి' ఇలా అనేక హిట్ చిత్రాలలో జానకి నటించారు. చివరి సారి 'అన్నీ మంచి శకునములే'లో ఆమె కనిపించారు.

**షావుకారు జనకి మృతికి ప్రముఖుల సంతాపం**

ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



## బౌద్ధ ఆశ్రమంపై సైనిక దాడి..

బర్మా(జనంసాక్షి):మయన్మార్‌లోని సాగైంగ్ ప్రాంతంలో ఓ బౌద్ధ ఆశ్రమంపై సైన్యం జరిపిన వైమానిక దాడిలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మందికిపైగా గాయపడ్డారు. మయౌంగ్ టౌన్‌షిప్‌లోని స్వెల్ లే ఓహ్ గ్రామంలో ఘటన చోటుచేసుకుంది. బాధితులంతా వారం రోజులపాటు జరిగే ధ్యాన శిబిరంలో పాల్గొనేందుకు వచ్చినవారేనని సమాచారం. మయన్మార్‌లో సాయుధ తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకొని కొంతకాలంగా సైన్యం దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సామాన్య పౌరులు సైతం ప్రాణాలు కోల్పోతున్నట్లు వస్తున్న వార్తలు అక్కడి ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## భారత్‌లో పర్యటనపై బంగ్లా ప్రధాని సందిగ్ధం!

న్యూఢిల్లీ(జనంసాక్షి):బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహమాన్ భారత పర్యటనకు సంబంధించి సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ నెల 23-25 తేదీల్లో ఆయన దిల్లీలో పర్యటించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బంగ్లా ప్రధాని కార్యాలయం స్పందిస్తూ.. తారిఖ్ పర్యటనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు ఇతర నేరస్థులను అప్పగించే విషయంలో భారత్ స్పందన కోసం బంగ్లా వేచి చూస్తున్నట్లు సమాచారం.భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనా.. త్వరలోనే స్వదేశానికి వెళ్తానని ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడటంపై బంగ్లా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే హసీనాను తమకు అప్పగించాలని బంగ్లా పదే పదే విజ్ఞప్తి చేస్తుండగా.. భారత్ ఆచితూచి స్పందిస్తోంది. మరోవైపు, సెప్టెంబర్ 12-13 దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో బంగ్లా ప్రధాని పాల్గొనాల్సి ఉండగా.. అంతకుముందే ఆయన దిల్లీ పర్యటనకు వస్తారని వార్తలు వచ్చాయి. బంగ్లా ప్రధానిని స్వాగతించే కార్యక్రమం కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయని రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడినప్పటికీ.. గంటల వ్యవధిలోనే దానిని ఉపసంహరించుకోవడం గమనార్హం.

## తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టండి

ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు.తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ



ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే.అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంధితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్‌తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం ప్రస్తుత ప్రీమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లొద్దు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. కేంద్ర విదేశాంగశాఖ అనుమతి నిరాకరించడంతో పర్యటన రద్దు చేసుకున్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటనలో ఉన్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 23న లండన్ నుంచి అమెరికా వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు సంబంధించి ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం.. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి యూకే, యూఎస్ పర్యటనకు చాలా రోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. అయితే, యూకే పర్యటనకు మాత్రమే విదేశాంగశాఖ అనుమతించింది. అమెరికా పర్యటనకు అనుమతివ్వలేదు.

**రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

## దిగ్భ్రాంతికి గురిచేసింది

లండన్(జనంసాక్షి):యూఎస్ పర్యటనకు కేంద్రం అనుమతించకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. తన పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించారని పేర్కొన్నారు. రాజకీయ కోణంలో పర్యటనను అడ్డుకోవడంగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. " కేంద్ర నూతన విద్యా విధానాన్ని అమలు చేయటమే నా లక్ష్యం. తెలంగాణకు అత్యుత్తమ విద్యాసంస్థలు తీసుకురావడమే నా లక్ష్యం. ప్రపంచస్థాయి సంస్థలను తీసుకురావటమే పర్యటన ఏకైక ఉద్దేశం. నా విదేశీ పర్యటన వికసిత్ భారత్‌కు దోహదపడుతుందని భావించా. దేశ నిర్మాణం కోసం రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని నమ్ముతాను" అని సీఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరో వైపు.. అమెరికా పర్యటన కొనసాగించాలని అధికారుల బృందానికి సీఎం ఆదేశించారు. అన్ని ఎంవోయూలు యథాతథంగా చేసుకోవాలని, వర్సిటీలతో భాగస్వామ్య ఒప్పందాలను ఖరారు చేసుకోవాలని అధికారులకు సూచించారు.

**లండన్ పర్యటనలో సీఎం..**

రెండ్రోజుల క్రితం దిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశానికి వెళ్లిన ముఖ్యమంత్రి .. అక్కడి నుంచి నేరుగా లండన్ చేరుకున్నారు. ఇవాళ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను ఆయన సందర్శిస్తారు. సాయంత్రం ఎమిరేట్స్ స్టేడియంలో జరిగే ఈపీఎల్ ఫుట్‌బాల్ ప్రజంటేషన్ కార్యక్రమానికి హాజరవుతారు. 22న కేంబ్రిడ్జ్ బృందంతో సమావేశం కానున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను, సాయంత్రం లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శిస్తారు. ఆగస్టు 23న సీఎం లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు బయలుదేరతారు.

## రాచయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

న్యూఢిలీ(జనంసాక్షి):రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం పక్రియలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వేలం పక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏదైనా అభ్యంతరం ఉంటే హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ మోహన్ ఉన్నారు. దీంతో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం కొనసాగించేందుకు టీజీఐఐసీకి న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్టయ్యాయి. రాయదుర్గం పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో ఎకరాకు రూ.175 కోట్లను కనీస ధరగా నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. అయితే పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేయనున్న భూములకు ఎలాంటి సంబంధం లేదని, అవి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. టీజీఐఐసీ నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. అంతే కాదు తదుపరి పిటీషన్‌పై విచారణకు నిరాకరించింది.

## తానెక్కడా కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

- మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ



**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్21 (జనంసాక్షి) :** కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## కారులో మహిళ మృతదేహం లభ్యం

- మృతురాలిని గోదావరిఖనికి చెందిన మానసగా గుర్తింపు



**హన్మకొండ, ఆగస్ట్20 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారులో మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో రెండ్రోజులుగా పార్క్ చేసిన కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. కారు డిక్కీని ఓపెన్ చేయగా మహిళ మృతదేహం మూటకట్టి ఉంది. కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతురాలు గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. కారును మానస స్నేహితుడు వినోద్ అద్దెకు తెచ్చినట్టు సమాచారం. దీంతో వినోద్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. 'కరీంనగర్‌లో గదిలో ఉన్నప్పుడు మానసకు ఫిట్స్ వచ్చాయి. ఫిట్స్, నోట్లో నుంచి నురగలు వచ్చి ఆమె చనిపోయింది. భయంతో మృతదేహాన్ని ఎల్కతుర్తి వద్ద కారులోనే వదిలి వెళ్లిపోయా' అని వినోద్ పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన ఎల్కతుర్తి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వినోద్ చెప్పిన విషయాలు నిర్ధరించుకునే పనిలో ఉన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**హైదరాబాద్, ఆగస్ట్20 (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోంది అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఇటీవల కాలంగా తెలంగాణ కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుం దన్నారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుంది. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టాలని పరోక్షంగా సూచించారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదు, ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని పేర్కొన్నారు. తమ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తిపెరుగుతుందన్నారు.


## రోడ్డుపై యమదూతలు



**కెరమెరి, ఆగస్టు21 (జనంసాక్షి) :** కెరమెరి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వీధి పశువుల బెడద తీవ్రమైంది. పగలు,రాత్రి తేడా లేకుండా ఆవులు,గేదెలు రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ,రోడ్డు మధ్యలోనే పడుకుంటున్నాయి. రాత్రి సమయంలో రోడ్డు నల్లగా ఉండటం వల్ల దూరం నుండి పశువులు కనిపించడం లేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల యజమానులు బాధ్యతారహితంగా రోడ్లపై వదిలేస్తున్నారని, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి పశువులను పట్టుకొని షెల్టర్ కు తరలించాలని, లేకుంటే పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తా

- రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తా
- అర్హులందరికీ రేషన్ కార్డులు
- ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సోయం బాపూరావు



**సిరికొండ ఆగస్టు 21 (జనంసాక్షి) :** ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సోయం బాపూరావు అన్నారు. శుక్రవారం సిరికొండ మండలంలోని నేరడిగొండ జి, చిన్నగోధుమల్లె, పెద్దగోధుమల్లె, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత సిరిచెల్మాలోని పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి పర్యటన ప్రారంభించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి, తాగునీరు, గృహ నిర్మాణ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నారాయణపూర్‌కు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వ స్థాయిలో మాట్లాడి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రెండు బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ కమిటీ హాల్ పనులు పూర్తి చేయిస్తానన్నారు. ఇళ్లు లేని ఆదివాసీ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేసి వచ్చే జనవరి నాటికి మరో 20 ఇళ్లు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటానన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను కోరుతానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతు ఆర్థిక సాయం వంటి పథకాలతో పేదలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమరం సత్యవతి కోటేష్, సిరికొండ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దర్జాగా కబ్జాలు.. నీళ్లలోనే ఇళ్లు..!

- చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు..
- బహిర్గత మవుతున్న లీడర్ల దందా..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రభుత్వ భూములపై, చెరువు శిఖాలపై అక్రమంగా ఇళ్లు కట్టే దందా భూపాలపల్లిలో గత పాలనలో పెరిగిపోయింది. అధికారుల కళ్లు గప్పి కొందరు లీడర్లు, రియల్ వ్యాపారులు దర్జాగా కబ్జాలు చేసి, పట్టాలు చేసి విక్రయాలు జరిపారు. భూపాలపల్లి పట్టణ శివారులోని ఓ చెరువు శిఖంలో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. వర్షాలకు చెరువు నిండడంతో నీరు నిలిచింది. ఆ నీటిలోనే సగం మునిగిన స్థితిలో అక్రమ ఇళ్ల నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ఫోటోలో కనిపిస్తున్నట్లు కాంక్రీట్ స్తంభాలు, ఇటుక గోడలతో ఇళ్లు నిర్మిస్తున్నారు. చుట్టూ నీరు చేరడంతో ఆ ప్రాంతమంతా జలమయంగా మారింది.

### కొరవడిన అధికారుల నిఘా..

చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టకూడదన్న నిబంధన ఉన్నా దానిని పట్టించుకునే వారే లేరు. వర్షం పడితే నీరు నిలిచే చోట ఇళ్లు కడితే భవిష్యత్తులో ఏమవుతుందో ఆలోచించకుండా అడ్డగోలుగా నిర్మాణాలు సాగాయి. స్థానికులు చెబుతున్న మాట ప్రకారం గత పాలకుల పాలనలో కొందరు పలుకుబడి ఉన్న లీడర్లు ఈ భూములను అక్రమంగా ప్లాట్లుగా విభజించి, పట్టాలు చూపించి అమాయకులకు అమ్మివేశారట. తక్కువ రేటుకు ఆశపడి కొనే వారు ఆ తర్వాత నీరు, బురద, వరదలతో ఇబ్బంది పడుతున్నారు.

### ప్రమాదం ముంచుకొస్తోంది..

చెరువు నిండితే ఈ ఇళ్లలో ఉండే వారి పరిస్థితి ఏమిటి? వరద వస్తే ప్రాణాలు దక్కుతాయా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఇళ్ల చుట్టూ నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు, పాముల బెడద పెరిగింది. ప్రభుత్వం ప్రజలకు ఇళ్లు ఇవ్వాల్సింది పోయి, ప్రభుత్వ భూములనే కబ్జా చేసి అమ్ముకునే దందాకు అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

### పట్టాలు చూపించి పబ్బం గడుపుతున్నారు..

ఈ కబ్జా భూములకు నకిలీ దస్తావేజులు, పట్టాల పేరుతో మోసాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ ధరకు ఆశపడి కొన్న వారు ఇప్పుడు "మేము మోసపోయాము" అని కన్నీరు పెడుతున్నారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని కొందరు వ్యక్తులు మింగేస్తుంటే చూస్తూ ఊరుకోవడం దారుణం. కలెక్టరేట్ కు కూతవేటు దూరంలోనే ఈ చెరువు శిఖం ఉండడం, అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మతలబు ఏమిటోననే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజా ధనంతో కట్టాల్సిన డ్రైనేజీలు, రోడ్లు ఇక్కడ కనిపించవు. కానీ అక్రమంగా కట్టిన ఇళ్లకు మాత్రం కరెంటు, నీళ్ల కనెక్షన్లు ఎలా వచ్చాయి అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. చెరువును కాపాడుకోకపోతే.. రేపు మన ఇల్లే చెరువు అవుతుంది. కబ్జాదారులకు కొమ్ముకాసే అధికారులు గుర్తుంచుకోవాలి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చేప పిల్లల పండగ వచ్చేనా?

- మత్స్యకారుల ఆశలపై నీళ్లు చల్లకుండా ప్రభుత్వం సిద్ధమయ్యేనా?
- జిల్లాలో 2 కోట్ల చేప పిల్లల పంపిణీ సకాలంలో జరిగేనా?





**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** ఎగువ కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. జిల్లాలోని 120కి పైగా గ్రామ పంచాయతీ చెరువులు,10 పెద్ద రిజర్వాయర్లు, కుంటలన్నీ జలకళను సంతరించుకున్నాయి. చేప పిల్లలను వదిలేందుకు ఇదే సరైన సమయం కావడంతో మత్స్యశాఖ టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ నెల మూడో వారంలో జిల్లా వ్యాప్తంగా 1.60 కోట్ల నుంచి 2 కోట్ల వరకు చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కింద ఈ సీడ్ ను పంపిణీ చేయనున్నారు. ఈ పథకంపైనే జిల్లాలోని దాదాపు 10 వేల మత్స్యకార కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఆరు నెలల్లో ఈ పిల్లలు పెద్దవై ఒక్కో కుటుంబానికి రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. అయితే గత రెండేళ్లుగా సీడ్ పంపిణీ ఆలస్యం కావడం, నాసిరకం సీడ్ రావడంతో 50 శాతం పిల్లలు నీటిలోనే చనిపోయాయని మత్స్యకారులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 91 మత్స్యకార సహకార సంఘాల పరిధిలోని సుమారు 6,980 మంది సభ్యులు, 2,960 మంది లైసెన్స్ కలిగిన వేటగాళ్లు ఈ పథకంపైనే ఆశలు పెట్టుకున్నారు. మత్స్యశాఖ ప్రణాళికల ప్రకారం జిల్లాలోని 5 ప్రధాన రిజర్వాయర్లు, దాదాపు 900 చెరువులు, కుంటలలో ఈ చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉంది. ఈసారి ఎలా జరగకుండా నాణ్యమైన రోహు, కట్ల, మ్రిగాల్, సిల్వర్ కార్ప్ రకాలను ఇవ్వాలని కోరుతున్నారు. టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, 10 రోజుల్లో పూర్తి చేసి, ఆగస్టు చివరి నాటికి పంపిణీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యేనా అని ఎదురుచూస్తున్నారు. ప్రతి మత్స్య సహకార సంఘానికి లెక్క ప్రకారం, చెరువు విస్తీర్ణాన్ని బట్టి సీడ్ అందేలా చూడాలని మత్స్యకార సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మరి మత్స్యశాఖ మత్స్యకారుల ఆశలకు అనుగుణంగా సిద్ధమయ్యేనా? లేక మళ్ళీ జాప్యంతో నిరాశపరుస్తుందా? అనేది వేచి చూడాలి. అధికారుల ఉదాసీనతకు 10 వేల కుటుంబాల జీవితాలు బలి కావాలా? ప్రభుత్వ రికార్డుల్లో లక్ష్యాలు ఘనంగా కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మత్స్యకారుల ఆవేదనను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రతి ఏడూ టెండర్ల సాకుతో కాలయాపన చేస్తూ, నీరు అడుగంటిపోయే సమయంలో నాసిరకం సీడ్ సరఫరా చేయడం వెనుక ఉన్న మతలబు ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు కాంట్రాక్టర్ల జేబులు నింపడానికేనా, లేక మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం నిద్రమత్తు వీడి, ఈ ఏడాదైనా అవినీతి రహితంగా, సకాలంలో నాణ్యమైన చేప పిల్లలను అందించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకుంటుందా లేదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే !

## అధ్యయన యాత్రలో ఎంపీ వద్దిరాజు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్రలో పాల్గొన్నారు. మహారాష్ట్రలోని రాయ్ గఢ్ జిల్లా ఉరాన్ లో శుక్రవారం ప్రారంభమైన స్థాయీ సంఘం అధ్యయన యాత్ర ఈనెల 27వతేదీ వరకు కొనసాగుతుంది. స్థాయీ సంఘం సభ్యులు యాత్ర మొదటి రోజున చమురు, సహజవాయువు సంస్థ (ఓఎన్జీసీ)కు చెందిన ఉరాన్ ప్లాంటును సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన " ప్రపంచ భౌగోళిక-రాజకీయ పరిస్థితులు-పెట్రోలియం రంగంపై దాని ప్రభావం"అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ తన అభిప్రాయాలు వెల్లడించారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా ఉంటాం: జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట, ఆగస్ట్20 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేస్తున్న అన్యాయంపై పోరాడాలని విద్యార్థులు సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం జరిగే విధంగా తీసుకున్న శక్తి స్కీం నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు తమ పక్షాన పోరాడి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని మాజీ మంత్రిని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన జగదీష్‌రెడ్డి విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



- అధికారులకు సంజయ్ జాజు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్21 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహిం చేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర?సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్ పోలను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి
- మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్21 (జనంసాక్షి) :** ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉందని సూచించారు.

# ప్రశ్నించినందుకు రాళ్లా?

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. ప్రజల సమస్యలను ఎత్తిచూపడం రాజకీయ శత్రుత్వం కాదు. కానీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన చోట రాళ్లతో దాడి చేయడం మొదలైతే.. అది ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా మాత్రమే చూడలేం. అది ప్రజాస్వామ్య సంస్కృతిపైనే దాడి.

రాజస్థాన్‌లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (CJP) బృందంపై దాడి జరిగిందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ దాడి వెనుక బీజేపీకి చెందిన వ్యక్తులున్నారని ఆరోపించారు. బృందంలోని ఆశుతోష్ రాంకా సహా పలువురు గాయపడ్డారని, వాహనాలపై రాళ్లు రువ్వి అద్దాలు ధ్వంసం చేశారని సీజేపీ చెబుతోంది. అయితే స్థానికులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. కాబట్టి దాడి వెనుక ఎవరు ఉన్నారన్నది దర్యాప్తులో తేలాల్సిందే.

కానీ ఇక్కడ అంతకంటే పెద్ద ప్రశ్న ఉంది. ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించడం నేరమా? పిల్లలకు మెరుగైన వసతులు కావాలని ప్రశ్నించడం నేరమా? ప్రజాధనం ఎలా ఖర్చవుతోందని అడగడం నేరమా? నేరం ఉంటే అది ప్రశ్నించిన వారిదా? లేక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రశ్నించిన వారిపైనే దాడి చేయడమా? అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి అధికారం ఒక ఆయుధం కాదు.. అది ప్రజలు అప్పగించిన బాధ్యత. అధికారం లో ఉన్నవారు తమను ప్రశ్నించేవారిని శత్రువులుగా చూడటం ప్రారంభిస్తే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. విమర్శను తట్టుకోలేని పాలన ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోతుంది. నచ్చని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ప్రశ్నించిన వ్యక్తిపైనే దాడి చేయడం బలానికి సంకేతం కాదు.. బలహీనతకు సంకేతం.

ఒక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు సరైన భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వం. పాఠశాల పరిస్థితి బాగోలేదంటే దాన్ని బాగుచేయాల్సింది పాలకులు. సమస్యను చూపించిన వ్యక్తినే సమస్యగా భావించడం పాలన కాదు.

ప్రజాస్వామ్యానికి అందం ఏమిటంటే.. అధికారంలో ఉన్నవారిని కూడా ప్రశ్నించ గలగడం. ఆ ప్రశ్నలు కొన్నిసార్లు కఠినంగా ఉండొచ్చు. విమర్శలు కొన్నిసార్లు ఘాటుగా ఉండొచ్చు. కానీ వాటికి సమాధానం కూడా వాదనతోనే ఉండాలి. రాళ్లతో కాదు. ప్రశ్నించే గొంతును అణచివేస్తే మిగిలేది మౌనం. మౌనం పెరిగిన చోట అధికార దుర్వినియోగానికి అవకాశం పెరుగుతుంది. ప్రజలు ప్రశ్నించడానికి భయపడే పరిస్థితి ఏర్పడితే ప్రభుత్వానికి తప్పులు కనిపించవు. తప్పులు కనిపించకపోతే వాటిని సరిదిద్దే అవకాశం కూడా ఉండదు.

ఇది బీజేపీకి మాత్రమే వర్తించే మాట కాదు. అధికారంలో ఉన్న ప్రతి రాజకీయ పార్టీకి వర్తించే ప్రజాస్వామ్య సత్యం. నేడు ఒక పార్టీ అధికారంలో ఉంటుంది. రేపు మరొక పార్టీ అధికారంలోకి రావచ్చు. కానీ ప్రశ్నించే హక్కు మాత్రం అధికార పార్టీ మారినప్పుడల్లా మారకూడదు. బీజేపీపై వచ్చిన ఆరోపణ నిజమా కాదా అన్నది దర్యాప్తులో తేలాలి. ఆరోపణ నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోపణ తప్పైతే వాస్తవాలను ప్రజల ముందుంచాలి. కానీ ఈ ఘటనను కేవలం ఒక రాజకీయ ఘర్షణగా కొట్టిపారేయ డం మాత్రం సరికాదు. ఎందుకంటే ఇందులో దాగి ఉన్న అసలు ప్రశ్న ప్రజా సమస్యలను ప్రశ్నించే హక్కు ఎంత సురక్షితంగా ఉంది? అన్నదే. ప్రశ్నించే వ్యక్తి ఏ పార్టీకి చెందినవాడై నా సరే.. అతని ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిందే. అతను తప్పు చేస్తే చట్టం ఉంది. అతను నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు ఉన్నారు. కానీ చట్టాన్ని పక్కనపెట్టి మూకదాడులు, రాళ్లదాడులు, బెదిరింపులు జరిగితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన సంకేతం.

చరిత్రలో ప్రజల ప్రశ్నలను బలవంతంగా అణచివేసిన ప్రతి వ్యవస్థ చివరకు మరింత పెద్ద ప్రతిఘటనను ఎదుర్కొంది. చిన్న ప్రశ్నను అణచివేయడం ద్వారా పెద్ద సమస్యను పరిష్కరించలేరు. ఒక గొంతును మూయించవచ్చు.. కానీ అదే ప్రశ్న మరొకరి గొంతులో వినిపిస్తుంది. ఒకరిని భయపెట్టవచ్చు.. కానీ భయాన్ని శాశ్వతంగా పాలనగా మార్చలేరు.

ఇలాంటి వైఖరి నుంచే విప్లవం పుట్టుకొస్తుంది. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా వారి గొంతులను అణచివేయాలనే ప్రయత్నం పెరిగినకొద్దీ అసంతృప్తి పెరుగుతుంది. అసంతృప్తి పెరిగినకొద్దీ ప్రతిఘటన పుడుతుంది. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును శత్రువుగా చూడటం పాలకులకు అత్యంత ప్రమాదకరమైన రాజకీయ తప్పిదం.

ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం ఉన్న పాలనకే ప్రజల విశ్వాసం ఉంటుంది. విమర్శను వినే ప్రభుత్వం బలహీనమైనది కాదు.. బలమైనది. తప్పును అంగీకరించి సరిదిద్దుకునే అధికారం ఓడిపోయినది కాదు.. మరింత విశ్వసనీయమైనది.

రాళ్లు గాయపరచగలవు.. ప్రశ్నలను చంపలేవు. గొంతును నొక్కగలరు.. ఆలోచనను ఆపలేరు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాపాడటం ఎవరి దయ కాదు.. రాజ్యాంగం ఇచ్చిన హక్కును గౌరవించడం. అందుకే ప్రశ్నించే వారిపై రాళ్లు కాదు.. సమాధానాలు రువ్వాలి. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఎందుకంటే ప్రశ్నించే గొంతు ఉన్నంతకాలమే ప్రజాస్వామ్యం బతికుంటుంది.

## హామీలు మరిచిన పాలక పక్షం...
# బాధ్యత మరిచిన ప్రతిపక్షం

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా దాదాపు రెండేళ్ల సమయం ఉంది. కానీ అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ వ్యవహార శైలి గమనిస్తే ఎన్నికలు వచ్చేసినట్లుగా అనిపిస్తోంది. కాంగ్రెస్, బిఆరెఎస్ నిర్వహిస్తున్న ప్రతి సభలోనూ "వచ్చేది మేమే... ప్రభుత్వం ఏర్పాటు చేసేది మేమే" అనే మాటలు ఇప్పటినుండే వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలపై చర్చ జరగాల్సిన సభ వేదికలు క్రమంగా ముందస్తు ఎన్నికల ప్రచార సభలుగా మారుతున్నాయన్న అభిప్రాయం బలపడుతోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రచారానికి తెరలేపారు మొన్న పరకాల సభలో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరొకసారి రేవూరి ప్రకాష్ రెడ్డిని గెలిపించాలనిప్రజలను కోరినారు అదే నియోజకవర్గంపై ఆశలు పెట్టుకున్న స్థానిక మంత్రి కొండ సురేఖ కూతురు సుస్మిత ఒకవైపు 21 సంవత్సరాలకే చట్టసభల్లో అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి చెబుతూనే వయస్సు మళ్ళిన వారికి మరోసారి గెలిపించాలని ఎలా మాట్లాడుతారని అన్నారు

ముఖ్యమంత్రి పై నేరుగా తీవ్ర విమర్శలు చేయడం నేడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా నిలిచాయి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో పదేళ్లు కొనసాగుతుందని 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని నేనే ముఖ్యమంత్రి ని అని పదేపదే వివిధ సభలలో ప్రకటించారు. మరోవైపు ప్రతిపక్ష బిఆర్ఎస్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో తమకే అధికారం వస్తుందని కెసిఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ప్రచారం చేస్తున్నారు. అంటే ఎన్నికలకు ముందే ప్రజల రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేయడానికి రెండు ప్రధాన రాజకీయ శిబిరాలు పోటీ పడుతున్నాయి.అయితే ప్రజాస్వామ్యంలో అసలు. ఇప్పుడు జరగాల్సింది ఎవరు గెలుస్తారని కాదు ప్రజా సమస్యల ఎజెండాగా ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిష్కారం దిశగా చర్చ చర్చ జరగాలి ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి ప్రభుత్వం తన జవాబిదారుతనాన్ని ప్రదర్శించాలి

అయితే ప్రస్తుతం అధికార పక్షం తన వైఫల్యాలకు గత ప్రభుత్వాన విధానాలే కారణమని చెబుతుంది పదేళ్ల పాలనలో పేరుకుపోయిన అప్పులు, ఆర్థిక భారాలు, పెండింగ్ బిల్లులు, అసంపూర్తి ప్రాజెక్టులు తమ ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చాయని కాంగ్రెస్ వాదిస్తోంది. మరోవైపు ప్రతిపక్షం మాత్రం మేము చేసిన అభివృద్ధి అప్పులను అవాస్తవాలు చెబుతున్నారని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తోంది.

తెలంగాణ రాజకీయాల్లో 'క్షుద్ర పూజల' అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్ర దుమారానికి, విమర్శల ప్రతివిమర్శలకు దారితీసింది. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు, రాష్ట్రానికి కీడు జరిగేలా ప్రతిపక్ష నేతలు క్షుద్ర/తాంత్రిక పూజలు చేయిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించగా, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని బిఆర్ఎస్ అంటుంది.

నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఇలాంటి మూఢనమ్మకాల అంశాలపై చర్చలు పెట్టడం రెండు పార్టీల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. అయితే అధికార పక్షం గత ప్రభుత్వ వైఫల్యాలను లెక్కపెడుతూ, ప్రతిపక్షం ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను లెక్కపెడుతూ ఉంటే మధ్యలో అసలు ప్రజల సమస్యలు మరుగున పడే ప్రమాదం ఉంది.



"మీరు పదేళ్లు పాలించారు" అని అధికార పక్షం అంటోంది. "మీరు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు" అని ప్రతిపక్షం అంటోంది. ఇరువైపులా ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. కానీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీల అమలు సంగతి ఏమిటి? నిరుద్యోగల ఉద్యోగ నోటిఫికేషన్ ఎప్పుడు? రైతుకు పంటకు గిట్టుబాటు ధర ఎలా? విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు? పేద కుటుంబానికి నాణ్యమైన వైద్యం ఎక్కడ? ప్రభుత్వ పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాలకు అవసరమైన నిధులు ఎప్పుడు? అనే ప్రశ్నలకు మాత్రం రాజకీయ వాదోపవాదాల స్థాయికి మించిన సమాధానాలు అవసరం. ఆ దిశగా ప్రతిపక్షాలు నిరంతర కార్యచరణ చేపట్టాలి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలి. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అధికారం కోల్పోయిక ఫామ్హౌస్‌హాకే పరిమితమయ్యారు అసెంబ్లీ ముఖం కూడా తొంగి చూడడం లేదు పదేళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి తన అనుభవాన్ని ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గట్టడానికిహా ప్రభుత్వానికి సూచన చేయడానికి వాడుకోడంలో విఫలమైనారు అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తారా అనే చర్చ కూడా ప్రజల్లో జరుగుతుంది

అయితే నేడు తెలంగాణలో విద్యా రంగం అత్యంత కీలకమైన అంశం. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయకుండా కేవలం ప్రైవేటు విద్యా వ్యవస్థ విస్తరణను అభివృద్ధిగా చూడటం సరైన దృక్పథం కాదు కానీ గత ప్రభుత్వ ఆలోచనలను ఈ ప్రభుత్వం కొనసాగిస్తుంది. ప్రభుత్వం ఎన్నికల హామీలలో విద్యా రంగానికి అనేక హామీలు ఇచ్చారు వాటిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పరిశోధన నిధులు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్లు వంటి అంశాలపై సమగ్ర చర్చ అవసరం. ప్రభుత్వం జనవరి 2026లో గ్రూప్-3 నియామకాలలో 1,370 మందికి నియామక పత్రాలు అందిస్తూ రాబోయే రోజుల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించింది. ఇప్పటికి ఆచరణ కరువైంది జాబ్ క్యాలెండర్ హామీ రెండు లక్షల ఉద్యోగాల ప్రకటన ఊసే లేదు నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు గత ప్రభుత్వంలో లాగే నిరాశ నిస్పృవ కు లోనై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించింది. ఉద్యమాల ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి ఆరు నెలలు గడిచిన ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు విద్యారంగానికి కేటాయిస్తామన్న 15% నిధులు ఫీజు నియంత్రణ చట్టం ఆచరణకు కరువైంది. వైద్య రంగం కూడా అదే స్థాయిలో ప్రాధాన్యం పొందాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది కొరత, మందుల లభ్యత, పేదలకు ఉచిత వైద్యం, జిల్లా ఆసుపత్రుల సామర్థ్యం, మెరుగైన వైద్యం. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు వంటి అంశాలపై హౌఅసెంబ్లీలో చర్చ జరగాలి.

> మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, ఫోర్త్ సిటీ, కూడా రాజకీయ ఆరోపణలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజా చర్చకు రావాలి. ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనాన్ని, ఆక్రమణల తొలగింపును, నగర పర్యావరణ పరిరక్షణను దీర్ఘకాలిక లక్ష్యాలుగా చెబుతోంది. ప్రతిపక్షాలు మాత్రం ఈ ప్రాజెక్టు పేదల ఇల్లు కూల్చి నిర్వాసితు లుగా మారుస్తున్నారని లక్షల కోట్లు దోచుకోవడానికి మూసి ప్రక్షాళన చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ప్రజలకు కావాల్సింది ఆరోపణలు కాదు-ప్రాజెక్టు వ్యయం ఎంత? ఎవరు ప్రయోజనం పొందుతారు? నిర్వాసితుల పునరావాసం ఎలా? పర్యావరణ ప్రభావం ఏమిటి? ప్రజా ఆస్తులు, ప్రజల హక్కులు ఎలా రక్షించబడతాయి? అనే ప్రశ్నలకు పారదర్శక సమాధానాలు. కావాలి అటువైపుగా ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాలి అసెంబ్లీ లో చర్చ జరగాలి పేద ప్రజలు నష్టపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి వారికి భరోసా కల్పించాలి

అలాగే వ్యవసాయం, సాగునీరు, కరువు పరిస్థితులు, రైతుల రుణభారం, ఉపాధి, మహిళల భద్రత, పట్టణ పేదరికం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ వంటి అంశాలు కూడా ముందుగా చర్చించాల్సినవి.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక రోజు జరిగే ప్రక్రియ. కానీ పాలన ఐదేళ్లు కొనసాగుతుంది. అందువల్ల ఎన్నికల చేయడం కంటే, పాలనలో ప్రజల జీవితాలను ప్రభావితం చేయడం ముఖ్యమైనది. . ప్రజలు ఇప్పుడు గతంలో కంటే ఎక్కువగా ప్రశ్నిస్తున్నారు, పోల్చి చూస్తున్నారు, హామీలను గుర్తుంచుకుంటున్నారు. అనే విషయాన్ని పాలకులు గుర్తు పెట్టుకోవాలి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక కేవలం భౌగోళిక రాష్ట్రం కోసం జరిగిన పోరాటం మాత్రమే లేదు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ఉపాధి, విద్య, నీరు, భూమి, గౌరవప్రదమైన జీవితం కోసం సాగిన సుదీర్ఘ ప్రజా ఆకాంక్ష ఉంది. ఆ ఆకాంక్షలకు అనుగుణంగాహాఎన్నికలలో ఇచ్చిన హామీల కు అనుగుణంగా గత పాలన కొనసాగ లేదు అందుకే కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు ఈ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన అవకాశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేర్చే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి ప్రధాన ప్రతిపక్షం ఆ దిశగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించేలా ముందుకెళ్లాలి అప్పుడే తెలంగాణ అభివృద్ధికి బాటలు పడతాయి



డా. ఆర్ ఎల్ మూర్తి
నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్
8247672658

## మార్చటం ఖాయం!




మార్చకపోవటం కాదు
మారుస్తూనే ఉన్నాం!
మార్చటం ఖాయం !
పొయ్యి మీద బియ్యం
పెట్టగానే అన్నం కాదు
సమయం పడుతుంది!
ఒకోసారి'చిమిడి'పోవచ్చు!
లేదా'పలుకు'ఉండొచ్చు
అందుక్కారణాలున్నాయి!
సమాజం మార్పు అంతే!
నాయకత్వ లోపం!
ప్రజాచైతన్యరాహిత్యం!
'మీరు'కూడాఒకకారణం
వేల సంవత్సరాలుగా
ప్రజల్నిపక్కదారిపట్టించారు!
ఆ దేవుడితో పాటు !
జన్మలుకర్మలుమాయలు
మంత్రాలు..అన్నీ పక్కదారులే!
మీరుగీసినపిచ్చిగీతలు
చెరపటానికే ఇన్ని
సంవత్సరాలు పట్టింది!
మేముకమ్యూనిస్టులం
మాది'శ్రమ'సిద్ధాంతం!
శ్రామికులే నిర్మాతలు!
మీదిచాతుర్వర్ణ సిద్ధాంతం!
మాది సమసమాజం
ఖచ్చితంగా నిర్మిస్తాం!
'కట్టె'లుమండుతున్నాయి!
'మంట'తగులుతోంది!
'వంట'కుఆటంకంలేదు !
అన్నంఅందరంతింటాం
మీలాగా దోచుకోము!
కొందర్ని పస్తులుంచం!
అదుగోనూతననిర్మాణం!
రోగాలు, దరిద్రం లేని
శ్రమసౌందర్యసమాజం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష
# ప్రజల ప్రశ్నలకు ఇచ్చే సమాధానమే

*ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, ఓటు వేయడం, ప్రభుత్వాలను ఎన్నుకోవడం మాత్రమే కాదు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, తమ హక్కుల కోసం శాంతియుతంగా ఉద్యమించడం, ఆ ప్రశ్నలకు పాలకులు జవాబుదారీతనంతో సమాధానం చెప్పడం ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం. ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగం మాత్రమే. ప్రజల గొంతును వినడం, వారి సమస్యలకు స్పందించడం దాని నిరంతర జీవనాడి.*



ఒక దేశంలో ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో తెలుసుకోవాలంటే ఎన్నికలు ఎంత సజావుగా జరిగాయన్నదానికంటే, ఒక సాధారణ పౌరుడు అధికారాన్ని ప్రశ్నించినప్పుడు ప్రభుత్వం ఎలా స్పందించిందో చూడాలి. ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రభుత్వం బలమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనం. ప్రశ్నను అణచివేసే పాలన మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతం.

ఇటీవలి కాలంలో విద్యార్థులు, యువత తమ విద్య, ఉపాధి, పోటీ పరీక్షలు, నియామకాలు, భవిష్యత్ అవకాశాలకు సంబంధించిన సమస్యలపై వివిధ ప్రాంతాల్లో ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వారి నిరసనల వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని కొట్టిపారేయడం సులభం. కానీ అలా చేయడం ద్వారా అసలు సమస్యను తప్పించుకున్నట్టవుతుంది. పరీక్ష ఎప్పుడు జరుగుతుందో తెలియని విద్యార్థి, నియామకం కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగార్థి, విద్యా విధానంపై ఆందోళన చెందుతున్న యువత-వీరి ప్రశ్నలు వ్యక్తిగత సమస్యలు మాత్రమే కావు. అవి దేశ సామాజిక, ఆర్థిక, విద్యా భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి.

ఒక విద్యార్థి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రభుత్వంపై యుద్ధం కాదు. ఉద్యోగార్థి నియామకాలలో పారదర్శకత కోరడం వ్యవస్థను కూల్చే కుట్ర కాదు. పరీక్షల నిర్వహణలో జాప్యంపై నిరసన వ్యక్తం చేయడం దేశ వ్యతిరేక చర్య కాదు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు పౌరుడికి ఉంది. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత.

ప్రభుత్వానికి చట్టబద్ధమైన అధికారం, పరిపాలనా వ్యవస్థ, పోలీసు యంత్రాంగం ఉన్నాయి. కానీ ఈ అధికారం ప్రజల నుంచే వచ్చింది. ప్రజలు తమ ఓటుతో ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగిస్తారు. ఆ అధికారాన్ని ప్రజలను నియంత్రించడానికి కాకుండా వారి సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగించాలి. అందువల్ల పాలనలో మొదటి ప్రశ్న "ప్రజలను ఎలా నియంత్రించాలి?" కాకుండా "ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించాలి?" కావాలి.

విద్యార్థి ఉద్యమాలను కూడా ఇదే దృష్టితో చూడాలి. యువతలో ఆందోళన పెరిగినప్పుడు ముందుగా దాని మూల కారణాలను గుర్తించాలి. ఉద్యోగాల కొరత ఉంటే ఉపాధి విధానంపై స్పష్టత ఇవ్వాలి. పరీక్షల్లో జాప్యం ఉంటే కారణాలను వెల్లడించాలి. నియామక ప్రక్రియలో సమస్యలు ఉంటే స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలి. విద్యా విధానంపై అభ్యంతరాలు ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిపుణులతో చర్చించాలి. సమస్యకు సమాధానం చెప్పకుండా నిరసన స్థలాల చుట్టూ బ్యారికేడ్లు పెంచడం ద్వారా సమస్య పరిష్కారం కాదు.

బ్యారికేడ్లు రహదారిని కొంతసేపు మూసివేయగలవు. పోలీసులు ఒక ప్రదేశంలో ప్రజలను ఆపగలరు. అవసరమైన పరిస్థితుల్లో నిర్బంధం కూడా చేయవచ్చు. కానీ ఒక యువకుడి మనసులో పుట్టిన ప్రశ్నను బ్యారికేడ్లతో ఆపలేరు. భవిష్యత్తుపై ఉన్న ఆందోళనను నిర్బంధంతో తొలగించలేరు. సమస్య పరిష్కారమైనప్పుడే ఆందోళనకు ముగింపు వస్తుంది.

ప్రజాస్వామ్య చరిత్రలో విద్యార్థి, యువజన ఉద్యమాలకు ప్రత్యేక స్థానం ఉంది. అన్యాయమైన విధానాలను ప్రశ్నించడం, విద్యా హక్కులను కోరడం, ఉపాధి అవకాశాల కోసం పోరాడడం, సామాజిక న్యాయాన్ని డిమాండ్ చేయడం వంటి అనేక సందర్భాల్లో యువత ముందుండింది. అందుకే విద్యార్థుల గొంతును బలహీనపరచడం అంటే ఒక నిరసనను మాత్రమే అడ్డుకోవడం



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

మిగితా తరువాయి సంచికలో..

# కులాన్ని వర్గంలో కలపలేం.. వర్గాన్ని కులంలో కరిగించలేం

భారత సమాజాన్ని అర్థం చేసుకోవడంలో కులం, వర్గం రెండూ కీలకమైన సామాజిక వాస్తవాలు. కానీ ఈ రెండింటిలో ఏదో ఒకదానిని మాత్రమే కేంద్రంగా పెట్టి భారతీయ అసమానతను వివరించాలనుకోవడం శాస్త్రీయంగా అసంపూర్ణం. ఆర్థిక దోపిడీని అర్థం చేసుకోవడానికి మార్క్సిస్టు వర్గ విశ్లేషణ ఎంత అవసరమో, భారత సమాజంలోని వేల సంవత్సరాల సామాజిక ఆధిపత్యాన్ని అర్థం చేసుకోవడానికి అంబేడ్కర్ కుల విశ్లేషణ కూడా అంతే అవసరం. కాబట్టి ప్రశ్న "కులమా? వర్గమా?" అనేది కాదు. కులం, వర్గం పరస్పరం ఎలా ముడిపడి సామాజిక అధికారం, ఆర్థిక వనరులు, విద్య, ఉద్యోగాలు, భూమి, గౌరవం వంటి అవకాశాలను అసమానంగా పంచుతున్నాయన్నదే అసలు ప్రశ్న.

మార్క్స్ దృష్టిలో సమాజంలోని ఉత్పత్తి సాధనాలపై ఎవరి నియంత్రణ కొనసాగుతుంది, ఎవరు తమ శ్రమను అమ్ముకుని జీవిస్తున్నారు, ఉత్పత్తి ద్వారా సృష్టించబడే మిగులు విలువను ఎవరు స్వాధీనం చేసుకుంటున్నారు అన్నది వర్గ సంబంధాల విషయంలో కీలక అంశాలు. భూమి, పరిశ్రమ, మూలధనం, మార్కెట్ వంటి ఆర్థిక వనరుల యాజమాన్యం రాజకీయ అధికారాన్నీ ప్రభావితం చేస్తుంది. అందుకే పేదరికాన్ని కేవలం వ్యక్తిగత వైఫల్యంగా చూడటం మార్క్సిస్టు విశ్లేషణకు విరుద్ధం. పేదరికం వెనుక ఆస్తి పంపిణీ, శ్రమ సంబంధాలు, వేతనాలు, ఉత్పత్తి వ్యవస్థ, ఆర్థిక విధానాలు ఉంటాయి.

అంబేడ్కర్ భారత వాస్తవికతను మరింత ప్రత్యేకమైన కోణంలో చూశారు. కులం కేవలం ఆర్థిక స్థితి కాదు. అది జన్మతః మనిషి సామాజిక స్థానం.అతని వృత్తి, వివాహం, నివాసం, సామాజిక సంబంధాలు, గౌరవం, అవకాశాలను నిర్ణయించే వ్యవస్థ. అందువల్ల ఒక వ్యక్తి ఆర్థికంగా కొంత ఎదిగినా కులపరమైన వివక్ష నుంచి పూర్తిగా విముక్తి పొందుతాడని చెప్పలేం. అదే సమయంలో కులవ్యవస్థ ఆర్థిక నిర్మాణం నుంచి పూర్తిగా వేరుగా ఉందని కూడా చెప్పలేం. భూమి ఎవరి చేతుల్లో ఉంది? విద్యకు చారిత్రకంగా ఎవరికెంత ప్రవేశం ఉంది? అధిక ఆదాయ వృత్తుల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎక్కువ? శ్రమను చేసే వర్గాల్లో ఎవరు ఎక్కువగా ఉన్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు కులం, వర్గం పరస్పర సంబంధాన్ని స్పష్టంగా చూపిస్తాయి.

భారత వ్యవసాయ గణాంకాలే దీనికి ఒక బలమైన ఉదాహరణ. 2015--16 వ్యవసాయ గణన ప్రకారం రెండు హెక్టార్లలోపు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు మొత్తం సాగు భూముల సంఖ్యలో 86.2 శాతం ఉన్నప్పటికీ, వారి చేతిలో ఉన్న నిర్వహిత



భూమి వాటా కేవలం 47.3 శాతం మాత్రమే. దేశంలో సగటు సాగు భూమి పరిమాణం 1970-71లో 2.28 హెక్టార్లుండగా 2015-16 నాటికి 1.08 హెక్టార్లకు పడిపోయింది. అంటే వ్యవసాయంలో పనిచేసే ప్రజల సంఖ్య పెరుగుతున్నా, ఒక్కొక్కరి చేతిలో ఉన్న ఉత్పత్తి వనరు క్రమంగా చిన్నదవుతోంది. భూమి లేని వ్యవసాయ కూలీల పరిస్థితి దీనికంటే మరింత అస్థిరమైనది.

ఇక్కడే కులం, వర్గం ఒకదానితో మరొకటి కలుస్తాయి. చారిత్రకంగా భూమి యాజమాన్యం, విద్య, పరిపాలనా అధికారాలు, వాణిజ్య అవకాశాలు సమానంగా పంపిణీ కాలేదు. ఫలితంగా సామాజికంగా వెనుకబడిన సమూహాల్లోని పెద్ద భాగం ఆర్థికంగానూ బలహీనంగా మిగిలింది. అయితే అన్ని అణగారిన కులాలు ఒకే ఆర్థిక వర్గానికి చెందవు; అలాగే అన్ని ఆధిపత్య కులాలూ సంపన్నులే కావు. ఇదే ముఖ్యమైన శాస్త్రీయ జాగ్రత్త. కులాన్ని నేరుగా వర్గానికి సమానంగా చూడటం ఎంత తప్పో, వర్గాన్ని పక్కన పెట్టి కేవలం కులంతోనే ప్రతి ఆర్థిక అసమానతను వివరించడం కూడా అంతే తప్పు.

విద్య రంగంలోని గణాంకాలు ఈ సంక్లిష్టతను మరోసారి చూపుతున్నాయి. 2021-22లో ఉన్నత విద్యలో మొత్తం 4.33 కోట్ల మంది విద్యార్థులలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 15.3 శాతం, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులు 6.3 శాతం, ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థులు 37.8 శాతం ఉన్నారు. అదే సంవత్సరం ఉన్నత విద్యలో మొత్తం స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతం కాగా, షెడ్యూల్డ్ కులాలకు 25.9 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 21.2 శాతంగా నమోదైంది. అంటే రిజర్వేషన్లు, ప్రభుత్వ విద్యా విస్తరణ, సామాజిక ఉద్యమాల వల్ల పురోగతి జరిగినా చారిత్రక అంతరాలు పూర్తిగా తొలగిపోలేదు.

ఆర్థిక అసమానత మరొక పొరను జత చేస్తోంది. ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదికలో పేర్కొన్న అంచనాల ప్రకారం దేశంలోని పై 10 శాతం ప్రజల చేతిలో 77.4 శాతం సంపద ఉండగా, దిగువ 60 శాతం ప్రజల వాటా కేవలం 4.8 శాతంగా ఉంది. ఈ స్థాయి సంపద కేంద్రీకరణను కేవలం కుల సమస్యగా గానీ, కేవలం వర్గ సమస్యగా గానీ చూడలేం. ఆస్తి, విద్య, సామాజిక మూలధనం, కుల ఆధిపత్యం, రాజకీయ ప్రాప్యత...ఇవి పరస్పరం బలపరుచుకునే అనేక పొరల అసమానతలుగా చూడాలి.

అందుకే పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వడం మాత్రమే పరిష్కారం కాదు. సబ్సిడీ అవసరమే అయినా అది నిర్మాణాత్మక అసమానతను తొలగించదు. భూమి సంస్కరణలు, నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటులో ఉన్న ఆరోగ్యం, సామాజిక భద్రత, గౌరవప్రదమైన ఉపాధి, కార్మిక హక్కులు, సమాన అవకాశాలు, వివక్ష వ్యతిరేక చట్టాల కఠిన అమలు, ఆస్తి మరియు సంపద పంపిణీలో న్యాయమైన వాటా అవసరం. కుల వివక్షను ఎదుర్కోకుండా ఆర్థిక సమానత్వం సాధ్యం కాదు. ఆర్థిక వనరుల పునర్విభజన లేకుండా కుల విముక్తి కూడా అసంపూర్ణంగానే మిగులుతుంది.

భారత రాజ్యాంగం ఈ రెండు పార్శ్వాలను కలిపే ప్రజాస్వామ్య మార్గాన్ని చూపింది. సమానత్వం, అస్పృశ్యత నిర్మూలన, సామాజిక న్యాయం, విద్య అలాగే ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రక్షణ వంటి నిబంధనలు కేవలం చట్టపరమైన నిబంధనలు మాత్రమే కావు. చారిత్రక అసమానతను సరిదిద్దే ప్రజాస్వామ్య సాధనాలు. అయితే రాజ్యాంగ హామీ సామాజిక వాస్తవంగా మారాలంటే ప్రభుత్వ విధానాలు గణాంక ఆధారితంగా, పారదర్శకంగా, పునర్విభజన లక్ష్యంతో ఉండాలి.

అసలు పోరాటం కులాన్ని వర్గంతో పోటీ పెట్టడం కాదు; కుల ఆధిపత్యం, ఆర్థిక దోపిడీ, పితృస్వామ్యం, రాజకీయ అసమానత పరస్పరం ఎలా పనిచేస్తున్నాయో గుర్తించి వాటి మూలాలను మార్చడం. కుల నిర్మూలన లేకుండా సామాజిక ప్రజాస్వామ్యం అసాధ్యం. ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుండా సామాజిక సమానత్వం నిలకడగా ఉండదు. ఒకరి విముక్తిని మరొకరి వ్యతిరేకంగా నిలబెట్టే రాజకీయానికి బదులు, సామాజిక గౌరవం, ఆర్థిక హక్కు, రాజకీయ అధికారం, విద్యా అవకాశాలను అందరికీ సమానంగా అందించే సమగ్ర ప్రజాస్వామ్య ఉద్యమమే భారత సమాజానికి అవసరం. అదే మార్క్స్ వర్గ విశ్లేషణలోని ఆర్థిక సత్యాన్ని, అంబేడ్కర్ కుల విశ్లేషణలోని సామాజిక సత్యాన్ని పరస్పర విరోధాలుగా కాకుండా భారత వాస్తవికతను అర్థం చేసుకునే రెండు శక్తివంతమైన శాస్త్రీయ సాధనాలుగా ఉపయోగించుకునే మార్గం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను వెంటనే పునరుద్ధరించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత తీసుకోవాలి
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం




**ముషీరాబాద్ ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఆదిలాబాద్ సీసీఐ సిమెంట్ పరిశ్రమను వెంటనే పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలువురు నేతలు, మేధావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "సీసీఐ పునరుద్ధరణ – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత" అనే అంశంపై టాస్క్ ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీసీఐ సాధన కమిటీ సభ్యులు, నిర్వాసితులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మేధావులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ సీసీఐ పునరుద్ధరణ ఉద్యమానికి తెలంగాణ జన సమితి పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబును కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమకు అవసరమైన భూమి, సున్నపురాయి, బంకమట్టి, బొగ్గు వంటి వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ రవాణా వ్యయంతో పరిశ్రమను నిర్వహించే అవకాశం ఉందన్నారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా పరిశ్రమ పునరుద్ధరణ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ కేంద్రం నుంచి స్పందన లేదని విమర్శించారు. పరిశ్రమ పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, జస్టిస్ చంద్రకుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితరులు మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పించే సీసీఐని పునరుద్ధరించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కారం రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్ రవీందర్ యాదవ్, జేవీ చలపతిరావు, నందిరామయ్య, జోజిరెడ్డి, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లోని సర్వే నంబర్ 155లో తీవ్ర ఉద్రిక్తత

- కూల్చివేతలను అడ్డుకున్న ప్లాట్ ఓనర్లు
- పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగిన చర్యలు
- భారీ యంత్రాలతో నిర్మాణాల తొలగింపు..
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- తమ హక్కులు, పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్లాట్ ఓనర్ల డిమాండ్



**ఉప్పల్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఉప్పల్ ప్రాంతంలోని సర్వే నంబర్ 155లో చేపట్టిన కూల్చివేతలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. సర్వే నంబర్ 155 పరిధిలోని నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లను తొలగించేందుకు అధికారులు భారీ యంత్రాలను రంగంలోకి దించడంతో అక్కడ ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కాయి. కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్లాట్ ఓనర్లు, సంబంధిత వ్యక్తులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### భారీ యంత్రాలతో కూల్చివేతలు

సర్వే నంబర్ 155 పరిధిలో అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టిన సమయంలో భారీ యంత్రాలను వినియోగించినట్లు తెలుస్తోంది. నిర్మాణాలకు సంబంధించిన ఏర్పాట్లను తొలగిస్తూ యంత్రాలు ముందుకు సాగిన దృశ్యాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కూల్చివేతల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.
కూల్చివేతల కారణంగా తమ ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ పలువురు ప్లాట్ ఓనర్లు అధికారుల చర్యలను ప్రశ్నించినట్లు సమాచారం. తమ వద్ద ఉన్న పత్రాలు, ప్లాట్లకు సంబంధించిన హక్కులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఏదైనా చర్య తీసుకోవాలని వారు కోరుతున్నట్లు తెలుస్తోంది.

### కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం

అధికారులు కూల్చివేతలకు సిద్ధమవుతున్న సమయంలో ప్లాట్ ఓనర్లు అక్కడికి చేరుకుని చర్యలను నిలిపివేయాలని కోరినట్లు సమాచారం. తమకు సంబంధించిన స్థలాల విషయంలో ముందుగా స్పష్టత ఇవ్వాలని, తమ వాదన వినాలని వారు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం కూల్చివేతల ప్రక్రియను కొనసాగించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరువర్గాల మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు.

### ప్లాట్ ఓనర్ల ఆందోళన

తమకు సంబంధించిన ప్లాట్లపై హక్కులు, పత్రాలు ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపడుతున్నారని ప్లాట్ ఓనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమ పత్రాలను పూర్తిగా పరిశీలించి, తమ వాదనను వినకుండా ఎలాంటి చర్యలు చేపట్టకూడదని వారు కోరుతున్నట్లు తెలుస్తోంది.
తమ ఆస్తులకు సంబంధించిన వివాదం ఏదైనా ఉంటే చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాలని, అకస్మాత్తుగా కూల్చివేతలు చేపట్టడం వల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్లాట్ ఓనర్లు పేర్కొంటున్నట్లు సమాచారం.

### అధికారుల చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది

అయితే సర్వే నంబర్ 155లో కూల్చివేతలకు అసలు కారణం ఏమిటన్నది పూర్తిగా స్పష్టంగా తెలియాల్సి ఉంది. కూల్చివేతలకు సంబంధించి అధికారులు ఏమైనా నోటీసులు జారీ చేశారా? ఏదైనా ప్రభుత్వ శాఖ లేదా సంబంధిత సంస్థ నుంచి ఆదేశాలు ఉన్నాయా? నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే కారణంతో చర్యలు తీసుకున్నారా? అన్న అంశాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.
అదేవిధంగా కూల్చివేతలకు ముందు సంబంధిత ప్లాట్ ఓనర్లకు ఎలాంటి సమాచారం ఇచ్చారు? వారి అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

### సర్వే నంబర్ 155పై ఆసక్తి

ఉప్పల్‌లో సర్వే నంబర్ 155కు సంబంధించిన భూములు, ప్లాట్ల వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కూల్చివేతల నేపథ్యంలో ఈ భూములకు సంబంధించిన యాజమాన్య హక్కులు, అనుమతులు, లేఅవుట్ వివరాలు, ప్రభుత్వ రికార్డులు తదితర అంశాలపై స్పష్టత అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. భూమికి సంబంధించిన పత్రాలు, అనుమతులు, సర్వే వివరాలు, సంబంధిత అధికారిక రికార్డులను పరిశీలించిన తర్వాతే ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### వివాదానికి పరిష్కారం ఎప్పుడు?

ఒకవైపు అధికారులు కూల్చివేత చర్యలు చేపడుతుండగా, మరోవైపు ప్లాట్ ఓనర్లు తమ హక్కులను కాపాడాలని కోరుతుండటంతో సర్వే నంబర్ 155 వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.
తమకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్లాట్ ఓనర్లు కోరుతున్నారు. మరోవైపు కూల్చివేతలకు సంబంధించిన పూర్తి కారణాలు, చట్టపరమైన ఆధారాలు, అధికారుల ఆదేశాలు బయటకు వస్తేనే అసలు పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
ఈ వ్యవహారంపై అధికారులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించడంతో పాటు, ప్లాట్ ఓనర్ల వాదనను కూడా పరిగణనలోకి తీసుకుని న్యాయపరమైన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటివరకు సర్వే నంబర్ 155లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఉప్పల్‌లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

# ధర్మ రక్షణ సభను విజయవంతం చేయాలి

**హయత్‌నగర్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** స్వదేశం, స్వధర్మం, స్వసంస్కృతి పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 29న నిర్వహించనున్న ధర్మ రక్షణ సభకు సంబంధించిన కరపత్రాలను వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో ఆవిష్కరించారు. చింతలకుంటలోని ప్రలవి గార్డెన్‌లో ఆగస్టు 29వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు ధర్మ రక్షణ సభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ధర్మ రక్షణ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక ఐక్యత, సమరసతను పెంపొందిస్తూ సమాజాన్ని సంఘటితం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సామూహిక



ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. దేశభక్తి, సామాజిక ఐక్యత, సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా వందేమాతరం 150 సంవత్సరాల స్ఫూర్తిని ఎలుగెత్తి చాటాలని నాయకులు పిలుపునిచ్చారు. స్వదేశం, స్వధర్మం, స్వసంస్కృతి పరిరక్షణ కోసం ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ఆగస్టు 29న సాయంత్రం 4 గంటలకు చింతలకుంట ప్రలవి గార్డెన్‌లో జరిగే ధర్మ రక్షణ సభకు నియోజకవర్గ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. "స్వదేశం.. స్వధర్మం.. స్వసంస్కృతి పరిరక్షణకై ముందుకు సాగుదాం.. ధర్మ రక్షణ సభను విజయవంతం చేద్దాం" అని పిలుపునిచ్చారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పురుషోత్తం రెడ్డి, ప్రదీప్ రెడ్డి, నవీన్, వెంకన్న, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందచారి, మహిళా అధ్యక్షురాలు పార్వతి, నాయకులు శ్రీధర్ రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసమే నాయకులు కృషి చేయాలి

- రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్ కేతురి వెంకటేష్

**శామీర్‌పేట్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యం లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ నూతన కమిటీ ఏర్పాటు కోసం శుక్రవారం రోజు అంతయి పల్లి లోని ఎస్ఎన్ ఆర్ గార్డెన్ లో దరఖాస్తు ఫారంలను స్వీకరించారు. ఈ యొక్క కార్య క్రమనికి ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కేతురి వెంకటేష్ , ఓబీసీ అబ్జర్వర్ డాక్టర్ నాగులూరి అరుణ్ కుమార్ గౌడ్, అలోక్ నాథ్, షామీర్ పేట్ రాజేష్ , భాస్కర్ , దరఖాస్తు ఫారములను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్,ఆర్ టి ఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష శిరీష క్రిష్ణరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బీపీటీ రాజు, శామీర్ పేట్ డివిజన్ అధ్యక్షులు నక్క సందీప్ గౌడ్, కర్రే రాజేష్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, చాప రాజు, దోసకాయల వెంకటేష్, తుంకి రమేష్, సురేందర్ ముదిరాజ్, తుంగతుర్తి రవి,మేడ్చల్ మాజీ జడ్పీటీసీ సాయిపేట శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ మాజీ అధ్యక్షులు గువ్వా రవి ముదిరాజ్, ఏఎంసి డైరెక్టర్ శివ శంకర్,తదితరులు పాల్గొన్నారు.




# పోలీసు అధికారుల సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం

- 13 పదవులకు 36 నామినేషన్లు.. 25న పోలింగ్, అదే రోజు ఫలితాల వెల్లడి

**నారాయణపేట, ఆగస్టు 21 (జనం సాక్షి) :** పోలీసు అధికారుల సంఘం ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఈ నెల 18న ఎన్నికల నోటిఫి కేషన్ విడుదల కాగా, శుక్రవారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్త యింది. పోలీసు హెడ్ క్వాటర్స్ నుండి అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్ ,సర్కిల్ వారీగా సీఐ లు వివిధ వింగ్స్ వారిగా డీఎస్పీ మహేష్ నామినేష న్లు స్వీకరించారు. మొత్తం 13 పదవులకు 36 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.ఈ ఎన్ని కల నోడల్ అధికారిగా డి డి ఆర్ బి డీఎస్పీ మహేష్ నిర్వహించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ శనివారం నిర్వహించనున్నారు.ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్య ర్థులు ఈ ఏడాది జనవరి1నాటికి కనీసం ఐదేళ్ల సర్వీ స్ పూర్తి చేసి ఉండాలి. అలాగే ఉద్యోగ విరమణకు ఇంకా ఐదేళ్ల సర్వీస్ ఉండాలి.గత మూడేళ్లలో ఎలాం టి మేజర్ పనిష్మెంట్ ఉండ కూడదు. అదేవిధంగా రెండు పర్యాయాల కంటే ఎక్కువగా సంఘం పదవిని నిర్వహించి ఉండకూడదు. ఈ నిబంధనలకు అనుగు ణంగా లేని నామినేషన్లను పరిశీలన సమయంలో తిరస్కరించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్



నిర్వహించనున్నారు.అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారం భించి, అనంతరం ఎన్నికల ఫలితాలను వెల్లడించను న్నారు.ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు అనం తరం అధ్యక్షుడు,కార్య దర్శి, కోశాధికారి తదితర పదవులను ఎన్నుకోను న్నారు. ఎన్నికైన సంఘం ప్రతినిధులు మూడేళ్ల పాటు పదవుల్లో కొనసా గనున్నారు.పోలీసు అధికా రుల సంక్షేమం,సమస్యల పరిష్కారం, ఐక్యత కోసం సంఘం ఎన్నికలు సజావు గా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

# హయత్‌నగర్ కోర్టుకు మౌలిక వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**హయత్‌నగర్, ఆగస్ట్ 21 (జనం సాక్షి) :** హయత్‌నగర్ కోర్టు ప్రాంగణంలో మౌలిక వసతులు మెరుగుపరచి, న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హయత్‌నగర్ కోర్టు ప్రాంగణాన్ని సందర్శించి, న్యాయవాదులతో కలిసి అక్కడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కోర్టులో సుమారు 200 మంది న్యాయవాదులు విధులు నిర్వహిస్తున్నారని, ప్రతిరోజూ కోర్టుకు వచ్చే కక్షిదారులు, ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోర్టు ప్రాంగణంలో పార్కింగ్ సౌకర్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సంబంధిత సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, భాస్కర్ సాగర్, బోడ బిక్షపతి, హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె లింగంగౌడ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్‌లో మైనారిటీ అభివృద్ధికి రూ.45 కోట్ల నిధులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 21 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ పట్టణంలో మైనారిటీ సంక్షేమం, అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.45 కోట్ల నిధులను తీసుకువచ్చామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వీరన్నపేటలోని హజ్రత్ హతావుల్లా షరీఫ్ మున్సి దర్గా వద్ద మైనారిటీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీగోడను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గతంలో దర్గా వద్దకు వచ్చిన సమయంలో ప్రహరీగోడ నిర్మించాలని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని, నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు మైనారిటీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించి ప్రహరీగోడ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కబరస్తాన్లు, దర్గాలు, మసీదులు తదితర మైనారిటీ ప్రార్థనా స్థలాల అభివృద్ధికి కట్టుబడి



ఉన్నామని, మంజూరైన పనులను దశలవారీగా ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని వివరించారు.హైలే అద్దీస్ ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ పనులు పూర్తయ్యాయని, అలాగే రహిమానియా ఈద్గా వద్ద బౌండరీ వాల్ నిర్మాణం, రాక్ కటింగ్, బ్యూటిఫికేషన్ తదితర పనులు కొనసాగుతున్నాయని, ఈ పనులు సుమారు 75 శాతం పూర్తయ్యాయని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో జామియా మసీదు వద్ద అండర్‌గ్రౌండ్, సెల్లార్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, మదీనా మసీదు వద్ద ఎక్స్‌టెన్షన్, అదనపు గదుల నిర్మాణానికి ఎస్టిమేషన్లు సిద్ధం చేశామని, ఆ పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వెల్లడించారు. తన పదవీకాలంలో మంజూరైన ప్రతి పనిని గ్రౌండ్ చేసి, పూర్తిచేసే బాధ్యతను తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌లో మైనారిటీ ప్రార్థనా స్థలాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. అంతకుముందు ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ప్రతినిధులు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, కార్పొరేటర్ సయ్యద్ మోసిన్, నాయకులు ఖాజా పాషా, సాదుల్లా, అబ్దుల్ హక్, రిజవాన్ సాయబ్, మౌనుద్దీన్ రఫీ, ఇర్ఫాన్ అమేర్, నసీర్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడండి

**నిజాంపేట్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్ 103లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం బాచుపల్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని అనేక చోట్ల ప్రభుత్వ భూమిని సర్వే నెంబర్లను తరుమారు చేసి కొంతమంది కబ్జాదారులు కబ్జా చేయడం సర్వసాధారనంగా మారుతుందని అని అన్నారు. అదే విధంగా నిజాంపేట్ సర్వే నెంబర్ 103ను కూడా తప్పుడు పత్రాలతో రిజిస్టేషన్ చేసుకొని ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారని తెలిపారు.. నిజాంపేట్ సర్వే నెంబర్ 102,103 మధ్యలో సర్వే నెంబర్ 104 లో కొంత బిట్టు ఎలా ఉంటది అని ప్రశ్నించారు. కనుక కబ్జా అయినా ప్రభుత్వ భూమిని వెంటనే కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఏఐటీయూసీ కార్యదర్శి ఆశి. యాదయ్య, కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# సేవాభావంతో ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలం

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 21 (జనం సాక్షి) :** వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారశీ మానోపాడ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, పోలీసుల సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మెన్ యూనిఫామ్ టర్న్ ఔట్, కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తనిఖీ చేశారు. పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మానోపాడు పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారెక్స్,స్టేషన్ రికార్డుల మెయింటేనెన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న,కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలతో, యువతతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. స్టేషన్ పరిధిలో గల రౌడీ, సస్పెక్ట్, హిస్టరీ షీటర్లను చెక్ చేస్తూ ఆన్లైన్ రికార్డులో నమోదు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారి షీట్స్ ను సంబంధిత ప్రాంతాలలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ లకు పంపాలని తెలిపారు.పాపిలోన్ డివైస్ ను వినియోగించి అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను చెక్ చేస్తూ



పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపు, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన ఎస్.సి.ఎచ్. పార్ట్ 1- 5, జనరల్ డైరీ, ఎఫ్.ఐ.ఆర్. ఇండెక్స్, ఆల్ఫాబీటికల్ ఇండెక్స్, డ్యూటీ రోస్టర్, విస్టింగ్ నోట్ బుక్స్, రౌడీ, సస్పెక్ట్ షీట్స్, గన్ లైసెన్స్ రిజిస్టర్, ఎల్.ఎల్.ఐ., గవర్నమెంట్ ప్రాపర్టీ రిజిస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, మొదలగున్నవి చెక్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్పై కి సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు.బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డయల్ - 100/112 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయి. ఇట్టి అప్లికేషన్ల పై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది తో జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని తెలిపారు. పోలీసు సిబ్బంది ప్రతి చర్య ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా ఉండాలని, సేవాభావం మరియు నిజాయితీతో విధులు నిర్వర్తించడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని సూచించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించి నప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా, ఎవరికైనా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకు రావచ్చు అన్నారు. ఒకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చేయాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ, డిఎస్పీ మొక్కలు నాటారు.

## ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



**కృష్ణ, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కృష్ణ ఎస్సై ఎస్ ఎం నవీద్ అన్నారు. మన ఊరు - మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కృష్ణ మండలంలోని కుసుమూర్తి గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద, ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై కృష్ణ ఎస్సై నవీద్ అవగాహన కల్పించారు.ప్రజలకు పోలీస్ శాఖతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా, గ్రామాల్లో శాంతి భద్రతలు, చట్టపరమైన అంశాలు, ప్రజల భద్రతకు సంబంధించిన సమాచారాన్ని చేరవేయడంలో పోలీస్ వాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దని తెలిపారు.అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరా లపై అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరగాళ్ల పట్ల అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, బ్యాంకింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ ఓటీపీ,పిన్,సి వి వి బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్ర దించాలని ఎస్ఐ తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించ డం, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయ డంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ముఖ్యమైన కూడ ళ్లు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, గ్రామ ప్రవేశ-నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ ప్రజలు, రైతులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## రూపారెడ్డి హత్యకు నిరసనగా ప్రైవేట్ టీచర్ల ఆందోళనకు బీజేపీ మద్దతు




**వనపర్తి బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ టీచర్లు చేపట్టిన ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి ఆందోళనలో పాల్గొని ప్రైవేట్ టీచర్లకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రూపారెడ్డి హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు భద్రత కల్పించడంతో పాటు, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.రూపారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ప్రైవేట్ టీచర్ల పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని వారు తెలిపారు.

# ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

- అన్యాయాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసన
- తహసిల్దార్ కు వినతిపత్రం
- ఉపాధ్యాయులను బానిసలుగా చూడటం సరికాదు
- హక్కులు, గౌరవాన్ని పరిరక్షించాలి
- వివేకానంద హై స్కూల్ ప్రిన్సిపల్ టి. లింగస్వామి




**చిన్నంబావి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులపై జరుగుతున్న అన్యాయాలు, అవమానకరమైన చర్యలను ఖండిస్తూ చిన్నంబావి మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయుల హక్కులు, ఆత్మగౌరవం, భద్రతకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించి, ఉపాధ్యాయుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా వివేకానంద హై స్కూల్ ప్రిన్సిపల్ లింగస్వామి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను బానిసలుగా చూస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను బోధించే ఉపాధ్యాయులే అవమానాలకు గురికావడం బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై అన్యాయంగా వ్యవహరించే వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులు, గౌరవాన్ని పరిరక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రత, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు, వేధింపులు, అవమానకరమైన చర్యలు పునరావృతం కాకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు కేవలం విద్యాబోధకుడు మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకుడని, అలాంటి ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే సమాజ భవిష్యత్తును గౌరవించడమే. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులపై జరుగుతున్న అన్యాయాలకు శాశ్వత పరిష్కారం చూపాలి అని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఉపాధ్యాయులు కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి



**తెలకపల్లి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని 197, 201 పోలింగ్ కేంద్రాల పరిధిలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి 2002 నాటి ఓటరు జాబితాను ప్రస్తుత జాబితాతో అనుసంధానం చేసే ప్రక్రియను పరిశీలించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తున్న తీరును పరిశీలించారు. 197వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఎం.డి. అక్బర్‌కు నోటీసు జారీ చేసే ప్రక్రియను కూడా పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ అర్హతను నిరూపించుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల అధికారిక ధ్రువపత్రాల్లో తమకు వర్తించే ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమర్పించిన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత నిర్ధారణ అనంతరం వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండల పరిధిలో 2002 ఓటరు జాబితా ఆధారంగా మ్యాపింగ్ కాని వారు 582 మంది, అనామలీస్ జాబితాలో 6,974 మంది ఉన్నట్లు తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. మొత్తం 7,566 మందికి నోటీసులు జనరేట్ చేసి, సంబంధిత ఓటర్లకు అందజేస్తున్నట్లు వివరించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో జాప్యం లేకుండా బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, సంబంధిత బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు ఉన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 21 (జనం సాక్షి) :** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సంబంధిత సమస్యలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు రమేష్ బాబు, శ్రీధర్, శ్రీనివాసులుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టుల వారీగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నిర్దేశిత సమయంలోగా పరిహారం చెల్లించాలన్నారు. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కావడం, కలెక్టర్ పీడీ ఖాతాలలో జమ కావడమే చెల్లింపు పూర్తయినట్లు భావించరాదని మంత్రి స్పష్టం చేశారు. మంజూరైన మొత్తం చివరకు సంబంధిత లబ్ధిదారుడికి చేరడమే అసలు లక్ష్యమన్నారు. అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తై నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించిన అటవీ సమస్యలు, పెండింగ్ చెల్లింపులు, క్లియరెన్సులు, ఇతర అడ్డంకులను గుర్తించి ఇరిగేషన్ శాఖకు వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం స్థాయిలో జోక్యం అవసరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తక్షణమే తీసుకెళ్లాలని సూచించారు.




భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలు, ఆర్థిక అనుమతులు, టోకెన్లు, ఇతర ఆర్థిక, ప్రక్రియాపరమైన కారణాలతో ఏ సాగునీటి ప్రాజెక్టు ఆలస్యమవుతున్నా సంబంధిత కలెక్టర్, చీఫ్ ఇంజినీర్ సమస్యను స్పష్టంగా గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీసి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, మల్లికార్జున్, తదితరులున్నారు.

# జ్వరంతో వచ్చే వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు తప్పనిసరి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జ్వరం వంటి లక్షణాలతో వచ్చే వారికి అవసరాన్ని బట్టి మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో కలెక్టర్ పర్యటించి ఫ్రైడే--డ్రైడే కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. కాలనీలోని పరిసరాలను పరిశీలించిన ఆయన ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల వృద్ధికి అవకాశం లేకుండా నిల్వ నీటిని తొలగించడంతో పాటు పారిశుద్ధ్య చర్యలను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. జ్వరం వంటి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించినప్పుడు వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల



భాగస్వామ్యంతో పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టంగా చేపట్టాలని సూచించారు.

### నిరుపయోగ పార్కులను గుర్తించి అభివృద్ధి చేయాలి

అనంతరం రామ్‌నగర్ కాలనీలోని మున్సిపల్ పార్కును కలెక్టర్ పరిశీలించారు. పార్కు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఫైల్ పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న, అభివృద్ధికి నోచుకోని పార్కులను గుర్తించి నివేదిక సమర్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

### కేడీఆర్ నగర్ బస్తీ దవాఖానాలో తనిఖీ

అనంతరం కేడీఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానాను కలెక్టర్ సందర్శించి ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పాము, కుక్క కాటు బాధితులకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. జ్వరంతో వచ్చే ప్రతి రోగికి అవసరాన్ని బట్టి మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బస్తీ దవాఖానాలో మందుల నిల్వలు, వైద్య సేవలు, రోగుల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, స్థానిక కౌన్సిలర్ పరుశురాం, ఆరోగ్యశాఖ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనోహరాబాద్‌లో తీన్మార్ మల్లన్నకు ఘనస్వాగతం

- గజమాలతో స్వాగతం పలికిన పార్టీ నాయకులు
- బహుజన హక్కుల కోసం బలమైన పోరాటం



**మనోహరాబాద్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** మనోహరాబాద్‌లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు మనోహరాబాద్ మండలంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఆయనకు పూల మాలలు వేసి సత్కరించారు పార్టీ నాయకులు మాట్లాడుతూ బహుజన హక్కుల కోసం బలమైన పోరాటం రాజ్యాధికారమే లక్ష్యంగా అందరు కృషి చేయాలని ప్రజా సమస్యల పరిష్కారం తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో టిఆర్పి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టరేట్ వద్ద ఆయుష్ విద్యార్థుల ధర్నా

- వేయి స్తంభాల గుడి నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 18 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని అనంతలక్ష్మి ఆయుర్వేద వైద్య కళాశాలకు చెందిన హౌస్ సర్జన్లు మరియు యూజీ వైద్య విద్యార్థుల స్టైపెండ్ పెంపు కోసం అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజ్ , హాస్పిటల్, వరంగల్‌లో కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఈరోజు 18వ రోజుకు చేరుకుంది. గత 18 రోజులుగా వివిధ ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో, నిరసనలో భాగంగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. వినతిపత్రం సమర్పించారు. ఈ ర్యాలీలో హౌస్ సర్జన్లు మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. హనుమకొండ వేయి స్తంభాల గుడి నుండి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు .ఈ ర్యాలీ ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజలకు సేవలందిస్తున్న హౌస్ సర్జన్లు మరియు వైద్య విద్యార్థులు భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సమాన పనికి సమాన స్టై ఫండ్ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రోహిత్ బాస్రే మాట్లాడుతూ"గత 18 రోజులుగా మా నిరసన కొనసాగుతోంది. వివిధ కార్యక్రమాల ద్వారా మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. అయినప్పటికీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా లేకపోవడం చాలా బాధాకరం.నాలుగున్నర సంవత్సరాలు ఎంతో కష్టపడి వైద్య విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు హౌస్ సర్జన్లుగా ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నాం. రోగులకు ఐపి, ఓపి సేవలు, ఎమర్జెన్సీ సేవలు, నైట్ డ్యూటీలు చేస్తూ రాత్రింబవళ్లు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం అన్నారుఅయినప్పటికీ గత పది సంవత్సరాలుగా హౌస్ సర్జన్ల స్టైపెండ్‌లో తగిన పెంపు జరగలేదు. అదే సమయంలో జీవన వ్యయం పెరుగుతున్నా, వైద్య సేవల బాధ్యతలు పెరుగుతున్నా మా స్టైపెండ్ మాత్రం తగిన స్థాయిలో పెరగకపోవడం అన్యాయం. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో డాక్టర్ ప్రణీత, డాక్టర్ దీప్తి, సదానంద్, కిరణ్ సాయి, సోమేష్ పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20(జనంసాక్షి) :** జిల్లాలో 2026 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి చెన్నూరి కిష్టయ్య లతో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, తూనికలు కొలతలు, సెర్ప్ శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 ఖరీఫ్ సీజన్ సంబంధిత వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో 23 వేల 934 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇందుకుగాను ధాన్యం కొనుగోలు కొరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లను ఇప్పటి నుండే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఎత్తు ప్రాంతాలలో ఉండి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా స్థలాలను గుర్తించాలని, గోనె సంచుల లభ్యత, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, టార్పాలిన్ కవర్లు అవసరం ఉన్న మేరకు ప్రభుత్వానికి ఇండెంట్ సమర్పించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, జిల్లా మేనేజర్ రజిత, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, సహాయ పౌర సరఫరాల అధికారి సాదిక్ హుస్సేన్, ఐ.కె.పి., సహకార, తూనికల కొలతల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూముల సర్వే పకడ్బందీగా చేపట్టాలి




- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి) :** భూముల సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో జరుగుతున్న భూముల సర్వేపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తి చేసిన భూముల సర్వే, చేయాల్సిన సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకు న్నారు. జిల్లాలో రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాల ఇబ్బందులు తొలగించేందుకు చేపట్టిన సర్వే ను గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులంతా క్షేత్ర స్థాయిలో సర్వేలో పాల్గొనడంతో పాటు, ఉన్నతాధికారులు సర్వే తీరును పర్యవేక్షించాలన్నారు. అధునాతన పరికరాల ద్వారా సర్వే నిర్వహణ సులభంగా, ఖచ్చితత్వంతో ఉంటుందని అన్నారు. ప్రణాళిక ప్రకారం సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణకు సంబంధించి నూతన ల్యాప్ టాప్ లను అధికారులకు కలెక్టర్ అందజేశారు. తొలుత కలెక్టర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్ తో కలిసి ఆర్థిక అక్షరాస్యత అవగాహన, సహాయం, ఆర్థిక అక్షరాస్యత కేంద్రానికి సంబంధించిన గోడ ప్రతులను డీఈవో భోజన్న, డిపిఆర్వో విష్ణువర్ధన్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం



- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**బోథ్, ఆగస్టు 20(జనంసాక్షి) :** అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని,పటిష్టమైన పోలీసింగ్ వ్యవస్థను అమలు చేస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందేలా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం బోథ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు.పోలీసు సిబ్బంది పరేడ్‌ను పరిశీలించి ప్రతి వారం పరేడ్ నిర్వహించాలని, విధుల్లో చక్కటి యూనిఫాం ధరించాలని సూచించారు. స్టేషన్ రికార్డులు, కేసు ఫైళ్లను పరిశీలించి పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు.మండలంలో గంజాయి, పేకాట, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజల సమస్యలను బాధ్యతగా స్వీకరించి సత్వర న్యాయం అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ వి. పురుషోత్తం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి హెల్త్ కార్డుల్లో ఎందుకు తేడాలు?

- విప్లవ కార్మిక సంఘాల సూటి ప్రశ్న



**బెల్లంపల్లి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** సింగరేణి హెల్త్ కార్డుల్లో, వైద్య సేవల్లో తేడాలు ఉన్నాయని, ఇలా ఎందుకు జరుగుతుందని విప్లవ కార్మిక సంఘాల నాయకులు సంస్థ యాజమాన్యాన్ని సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం వారు బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో హెల్త్ కార్డు విధానాన్ని సంస్థలో అమలు చేస్తున్నారని, హెల్త్ కార్డు వినియోగంలో కొందరికి పూర్తి స్థాయి వైద్య సేవలు అందుతుండగా, మరికొందరికి చికిత్సలు, ఆసుపత్రుల ఎంపిక, నగదు రహిత వైద్యం వంటి అంశాల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్ కార్డు సేవల్లో ఎందుకు ఈ తేడాలు వస్తున్నాయో సింగరేణి యాజమాన్యం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూటిగా ప్రశ్నించారు. కార్డు ఉన్న ప్రతి అర్హుడైన ఉద్యోగి, పెన్షనర్, కుటుంబ సభ్యుడికి సమానమైన వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య సేవల్లో అందరికీ సమాన హక్కు ఉండాలన్నారు. హెల్త్ కార్డుల విషయంలో వ్యత్యాసాలకు స్వస్తి పలకాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్, ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం పోచ మల్లు, ఎస్జికేఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల మహేందర్ పాల్గొన్నారు.

# కుభీర్‌లో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ

- రైతు బీమా, కళ్యాణలక్ష్మి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపాటు



కుభీర్, ఆగస్టు 21, (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కేసీఆర్ హయాంలో ప్రారంభమైన సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కుభీర్ మండల కేంద్రంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా దిశానిర్దేశం చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు కిరణ్ కొమ్రేవార్, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామ్ సుందర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల రక్షణ కోసం ప్రవేశపెట్టిన 'రైతు బీమా', పేద కుటుంబాల ఆడపిల్లల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచిన 'కళ్యాణలక్ష్మి' వంటి ప్రతిష్టాత్మక పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అణగదొక్కేందుకు కుట్ర పన్నుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిరుపేదలు, రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని, ప్రజల పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు ధరించి, పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 21 (జనం సాక్షి) :** భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని హరిత కాకతీయ వద్ద భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన సందర్భంగా హనుమకొండలోని హరిత కాకతీయకు భారత ఎన్నికల సంఘం కార్యదర్శి చేరుకోగా హనుమకొండ జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ ఎన్.రవి, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ , ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు. శుక్ర, శనివారాలు వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో క్లెయిమ్ లు, అభ్యంతరాలపై భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి బిఎల్వోలతో చర్చిస్తారు.భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో హనుమకొండ తహసిల్దార్/ ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఇతర అధికారులు ఉన్నారు.

# ఆర్ట్స్ కళాశాలలో మౌలిక వసతులపై ఈసీ పరిశీలన



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 21 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రతిపాదించిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు శుక్రవారం పరిశీలించారు. కళాశాలప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పాలకమండలి సభ్యులకు వివరించారు. ఇందులో భాగంగా కంప్యూటర్ సైన్స్ విభాగంలో విద్యార్థుల అవసరాల కోసం 40 కంప్యూటర్ల ఏర్పాటుకు రూ.30 లక్షలు, కళాశాల సమావేశ మందిరంలో 200 కుర్చీల ఏర్పాటుకు రూ.10.80 లక్షలు, ఎంబీఏ విభాగంలోని ఆరు తరగతి గదుల్లో కుర్చీల ఏర్పాటుకు రూ.14,78,857 అవసరమవుతుందని వివరించారు. ఈ మూడు ప్రతిపాదనలకు కలిపి మొత్తం రూ.55,58,857 వ్యయం అవుతుందని తెలిపారు.అనంతరం పాలకమండలి సభ్యులు కళాశాలలోని సంబంధిత విభాగాలను, సమావేశ మందిరాన్ని, తరగతి గదులను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రతిపాదించిన మౌలిక వసతుల అవసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను అందించేందుకు మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో కీలకమని ఈసీ సభ్యులు పేర్కొన్నారు.పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్ లాల్, డాక్టర్ నవీన్, డాక్టర్ బొడ్డిరెడ్డి రమ, డాక్టర్ అనిత రెడ్డి, పుల్లూరు సుధాకర్, డాక్టర్ చిర్రా రాజు మౌలిక వసతుల ప్రతిపాదనలను పరిశీలించారు. వారి వెంట కాకతీయ విశ్వవిద్యాలయం ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి పాల్గొని ప్రతిపాదనలకు సంబంధించిన వివరాలను ఈసీ సభ్యులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ఎన్ రెహమాన్, సహాయ రిజిస్ట్రార్ శ్రీలత, ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ ఆదిరెడ్డి, కేయూ ఇంజనీర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# సెయింట్ సావియో స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



**తొర్రూరు ,ఆగస్టు 21 (జనం సాక్షి) :** తొర్రూరు మున్సిపల్ పరిధిలోని కంటాయపాలెం రోడ్డులో గల సెంట్ సావియో పాఠశాలకు చెందిన ప్రైవేట్ బస్సు 30 మంది పిల్లలతో శుక్రవారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో అన్నారం రోడ్డులో వెళ్తుండగా బస్సు వెనక టైర్ ఊడిపోవడంతో బస్సులో ఉన్న 30 మంది పిల్లలు భయభ్రాంతులకు గురై భయానక వాతావరణం సృష్టించింది. ఏమీ తెలియని వయసులో ఉన్న పది సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం ఏర్పడినది. పిల్లలకు ఏమీ కాకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు టైర్ ఊడి పోయే వరకు చూసుకోలేని డ్రైవర్ను పెట్టుకొని నడిపిస్తున్న స్కూల్ యాజమాన్యాము పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వాడ్యాల్-లక్ష్మణచందా రహదారి అభివృద్ధికి రూ.10 కోట్ల ప్రతిపాదనలు



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** నిర్మల్ నియోజకవర్గంలోని వాడ్యాల్ -లక్ష్మణ్ చందా రహదారి అభివృద్ధి, విస్తరణకు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో మూడు కీలక పనులకు నిధులు మంజూరు చేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కుచాడి శ్రీహరి రావు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికీ వినతిపత్రం సమర్పించారు. కనకాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి కామల్కోట సమీపంలోని గోదావరి వంతెన మీదుగా జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు వెళ్లే ఈ రహదారిలో వాడ్యాల్, లక్ష్మణచందా గ్రామాల పరిధిలో రహదారి విస్తరణ, బలోపేతం, సీసీ డ్రైన్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని శ్రీహరి రావు వివరించారు. లక్ష్మణచందా పరిధిలో కనకాపూర్–చింతల్‌చందా రహదారి విస్తరణ, బలోపేతానికి రూ.4.80 కోట్లు, వాడ్యాల్ పరిధిలో అదే రహదారి పనులకు రూ.4 కోట్లు, వాడ్యాల్ గ్రామ పరిధిలో బైపాస్ రోడ్డుకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సమర్పించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులకు త్వరితగతిన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని మంత్రి వెంకట్‌రెడ్డి ని శ్రీహరి రావు కోరారు.



## 30 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో తేదీ 20-08-2026 రోజున విశ్వసనీయ సమాచారం ప్రకారం వజీద్ అలీ జిల్లా పౌరసరఫరాల అధికారి, రాజ్ కుమార్ డిటి ఎన్ఫోర్స్మెంట్, గిర్ధవర్ సిర్పూర్ టి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా సిర్పూర్ టి చుట్టుపక్కల గ్రామాల కార్డుదారుల నుండి కొనుగోలు చేసిన 63 బస్తాలు సుమారు 30 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని మహేంద్ర ౧+20౨ 2185 వాహనం ద్వారా అక్రమంగా మహారాష్ట్రకు తరలించుటకు ప్రయత్నిస్తుండగా సిర్పూర్ టీ వద్ద పట్టుకున్నారు. ప్రాథమిక వివరాల ప్రకారం నిందితుడు సిర్పూర్ టీ కు చెందిన సురేష్ టేకేడర్ అని తెలిసినది. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించబడుతున్న పిడిఎస్ బియ్యాన్ని దుర్వినియోగం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## మేడిపల్లి రహదారి అభివృద్ధికి రూ.2 కోట్ల మంజూరు



**నిర్మల్ రూరల్ ఆగస్టు 21, (జనంసాక్షి) :** జాతీయ రహదారి ఎన్‌హెచ్ -44 నుంచి మేడిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిని డబుల్ లైన్‌గా అభివృద్ధి చేసి, మధ్యలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కి శ్రీహరి రావు, సోమ భీమ్ రెడ్డి లు కృతజ్ఞతలు తెలిపారు.

## అత్యవసర వేళల్లో వేగవంతమైన సమన్వయానికి వాకీటాకీలు



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 21 (జనంసాక్షి):** రోజువారీ విధి నిర్వహణలో అధికారులు వాకీటాకీలను సమర్థవంతంగా వినియోగించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సూచించారు.శుక్రవారం బల్దియా కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులకు వాకీటాకీలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలు, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల మధ్య వేగవంతమైన సమాచార మార్పిడి, సమన్వయానికి వాకీటాకీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి, విధి నిర్వహణలో వాకీటాకీల వినియోగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22 ఆగస్టు 2026

# ధర్మారెడ్డిపల్లి కాలువను పూర్తి చేసి సాగునీరు అందించాలి

- గుంతలమయమైన ఆర్‌ఎంబీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- అర్హులైన పేదలందరికి పింఛన్లు మంజూరు చేయాలి
- కొమ్మాయిగూడెం గ్రామ సమస్యలపై సిపిఎం నిరసన దీక్ష




**రామన్నపేట, ఆగస్టు 21 (జనంసాక్షి) :** మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జల్లెల పెంటయ్య మాట్లాడుతూ.. ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణం ప్రారంభమై 23 సంవత్సరాలు గడిచినా నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. కాలువను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని భూములు పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలువ పూర్తయితే ఈ ప్రాంతంలోని అనేక మంది రైతులకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని వెంటనే బడ్జెట్ కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రామన్నపేట--కొమ్మాయిగూడెం మీదుగా పెద్దకాపర్తి వరకు ఆర్‌ఎంబీ రోడ్డు అనేక సంవత్సరాలుగా గుంతలమయంగా మారి కాళ్లు చేతులు విరిగి ప్రాణాలు పోయినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్వాన్న స్థితిగా ఉన్న రోడ్డును వెంటనే నూతనంగా ఏర్పాటు చేయాలని కోరారు.గ్రామంలో అనేక మంది అర్హులైన పేదలు ఉన్నప్పటికీ సంవత్సరాలు దాటుతున్న నేటికీ పింఛన్లు అందడం లేదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం పింఛన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. కొమ్మాయిగూడెం నుండి వెలిమినేడు. సిరిపురం గ్రామాలకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ పార్టీ మండల నాయకులు కూరెళ్ళ నరసింహ చారి,కందుల హనుమంతు, కల్లూరు నాగేష్, బావండ్లపల్లి బాలరాజు,ఆవనగంటి నాగేష్, మేడి ముకుందం,మునుకుంట్ల లెనిన్,పల్లె సత్యం, దీక్షలో కూర్చున్న నాయకులు శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు,ఎర్ర రవీందర్,ఎర్ర కాటమయ్య,అంతటి సత్తయ్య, అంతటి నరసింహ, శానగొండ రాము, సాగర్ల శేఖర్,గుణగంటి మల్లేష్, జల్లెల మల్లేశం,ఆకిటి మల్లేశం,ఆకిటి శ్రీను, కడప చరణ్,బాణాల నవీన్ రెడ్డి,గోలి ఉత్తేజ్,కొండగడప నవీన్, జల్లెల శివకుమార్, బోయపల్లి శంకర్, పొట్లచెరువు శంకరయ్య, మాజీ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ,ఎర్ర సుమలత ఎర్ర అలివేలు, బాత్క ఐలమ్మ,బాత్క మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసమే నాయకులు కృషి చేయాలి

- రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్ కేతురి వెంకటేష్



**శామీర్‌పేట్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యం లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ నూతన కమిటీ ఏర్పాటు కోసం శుక్రవారం రోజు అంతయి పల్లి లోని ఎస్ఎన్ ఆర్ గార్డెన్ లో దరఖాస్తు ఫారంలను స్వీకరించారు. ఈ యొక్క కార్య క్రమనికి ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కేతురి వెంకటేష్, ఓబీసీ అబ్జర్వర్ డాక్టర్ నాగులూరి అరుణ్ కుమార్ గౌడ్, అలోక్ నాథ్, షామీర్ పేట్ రాజేష్, భాస్కర్, దరఖాస్తు ఫారములను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్,ఆర్ టి ఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంతం శిరీష శిరీష క్రిష్ణరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బీపీటీ రాజు, శామీర్ పేట్ డివిజన్ అధ్యక్షులు నక్క సందీప్ గౌడ్, కర్రే రాజేష్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, చాప రాజు, దోసకాయల వెంకటేష్, తుంకి రమేష్, సురేందర్ ముదిరాజ్, తుంగతుర్తి రవి,మేడ్చల్ మాజీ జడ్పీటీసీ సాయిపేట శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ మాజీ అధ్యక్షులు గువ్వా రవి ముదిరాజ్, ఏఎంసి డైరెక్టర్ శివ శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు



**కొండమల్లేపల్లి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐలు అజ్మీరా రమేష్, ముత్యాల రామ్మూర్తి, పోలీసు అధికారులకు నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ హైస్కూల్ యాజమాన్యం జాజి రెడ్డి, రాణి రెడ్డి, కొండమల్లేపల్లి పట్టణ జేబీ కాలనీవాసులు, పాఠశాల విద్యార్థులు జిల్లా పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ను కలిసి జిల్లా పోలీసు అధికారులు, దర్యాప్తు బృందం రాత్రింబవళ్లు శ్రమించి కేసును త్వరితగతిన ఛేదించిన తీరును అభినందించారు. ఘటనతో భయాందోళనకు గురైన తమకు పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు భరోసా నమ్మకాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసులో చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి దర్యాప్తు పూర్తిచేసి న్యాయస్థానంలో త్వరితగతిన చార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలుగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజల భద్రత నేర నియంత్రణకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రతి కాలనీ ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మీ చుట్టూ ఉన్న పరిసరాలలో నిషేధిత గంజాయి ఆనవాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని ఎలాంటి అనుమానాలున్నా స్థానిక పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఎస్పి సూచించారు. వారి వెంట కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, జేబీ కాలనీ వాసులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య విద్యా వ్యవస్థకే మాయని మచ్చ

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు
- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ
- నిందితులను కఠినంగా శిక్షించాలి



**రామన్నపేట, ఆగస్టు 21 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య ప్రస్తుత విద్యా వ్యవస్థకే మాయనిమచ్చ అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని రామన్నపేట మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. రూపారెడ్డి హత్య ను నిరసిస్తూ శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధి ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుండి సుభాష్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుభాష్ సెంటర్ లో ఏర్పాటు చేసిన రూపారెడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కరెస్పాండెంట్స్ మాట్లాడుతూ నేటి విద్యా వ్యవస్థలో కొంతమంది విద్యార్థుల, వారి తల్లిదండ్రులు ధోరణి తీవ్ర ఆందోళనకరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ మనుగడలో గురుతర బాధ్యత వహించే ఉపాధ్యాయులకు రక్షణ కరువైందని, ఇది విద్యా వ్యవస్థ మనుగడకు పెను ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. రూపారెడ్డి హంతకులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరెస్పాండెంట్స్ టి. మల్లిఖార్జున్, జె. మార్టిన్, జి. నరేందర్ రెడ్డి, కనకచారి, ఎన్. నాగరాజు, శ్రీధర్ ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు చేసిన ఘనత పువ్వాడ అజయ్‌దే..

- మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఖమ్మం జర్నలిస్టులకు 23 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, అందుకు సంబంధించి జీవో జారీ చేసిన ఘనత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించి, వారి చిరకాల కోరికను నెరవేర్చేందుకు పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేశారని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో 23 ఎకరాల భూమికి రాష్ట్ర కేబినెట్ నుంచి ఆమోదం తీసుకుని, ఆ స్థలాన్ని హౌసింగ్ సొసైటీకి బదలాయిస్తూ జీవో జారీ చేయించారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమం విషయంలో విఫలమైందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ తీసుకున్న చొరవ చేసిన కృషి ఫలితంగా మంజూరైన ఇళ్ల స్థలాలను జర్నలిస్టులకు కేటాయించే ప్రయత్నం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదని ఆరోపించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాత్రమేనని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించిన ట్రాస్మా
- 1,500 మంది ఉపాధ్యాయులతో శాంతి ర్యాలీ
- అధికారులకు వినతి పత్రాల సమర్పణ



**జడ్చర్ల, ఆగస్టు 21 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల హెచ్ఎం రూపా రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ జడ్చర్ల ట్రాస్మా ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అయ్యూబ్ అహ్మద్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు నరేష్ కుమార్ మాట్లాడుతూ రూపా రెడ్డిపై కత్తులతో దాడి చేసి హత్య చేయడం సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి రూ. 5 కోట్ల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా ప్రభుత్వం పటిష్ట రక్షణ కల్పించాలన్నారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఎంఈఓ కార్యాలయం నుంచి నేతాజీ చౌక్, గాంధీ చౌక్ మీదుగా సాగిన ర్యాలీలో 1,500 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్, సీఐ, ఎక్సైజ్ సీఐలకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాస్మా ప్రతినిధులు విష్ణువర్ధన్, సందీప్, గోవర్ధన్, సత్యం, శ్రీనాథ్ రెడ్డి, రఫిక్, బాలరాజ్, శ్రీనాథ్, గోపీనాథ్, విజయ్, అనూష, వరలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

- శ్రీరామ కుంటలో విషాద ఘటన..
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** పెంట్లం గ్రామ సమీపంలోని కుంటలో ఈతకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంట్లం గ్రామానికి చెందిన ఇనుపనూరి సంతోష్ (35) తన స్నేహితుడితో కలిసి గ్రామ సమీపంలోని శ్రీరామ కుంటకు ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో మునిగిపోయి మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఈతగాళ్ల సహాయంతో కుంటలో గాలింపు చేపట్టి సంతోష్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'రాఖీ ఎక్స్‌ప్రెస్' పేరుతో డిహెచ్‌ఎల్ 50 శాతం తగ్గింపు

**ఖైరతాబాద్, ఆగస్ట్ 21 (జనం సాక్షి) :** డిహెచ్ఎల్ ఎక్స్ ప్రెస్ 'రాఖీ ఎక్స్‌ప్రెస్' పేరుతో భారత్ నుంచి అంతర్జాతీయ షిప్‌మెంట్లపై ఫ్లాట్ 50 శాతం తగ్గిం పు అందిస్తున్నట్లు డిహెచ్ఎల్ ఎక్స్ ప్రెస్ భారతదేశ వైస్ ప్రెసిడెంట్(కమర్షియల్) సందీప్ జునేజా శుక్ర వారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ ఈ ఆఫర్ ఈనెల 28 వరకు డిహెచ్ఎల్ ఎక్స్ ప్రెస్ భారతదేశ వైస్ ప్రెసిడెంట్(కమర్షియల్) సందీప్ జునేజా రాఖీ -50 ప్రోమో కోడ్‌తో వర్తిస్తుందని తెలిపారు. డిహె చ్ఎల్ ఎక్స్ ప్రెస్ భారతదేశ వైస్ ప్రెసిడెంట్ (కమ ర్షియల్) సందీప్ జునేజా ఎక్స్ ప్రెస్, బ్లూ డార్ట్ రిటైల్ సర్వీస్ పాయింట్లు, మై డిహెచ్ఎల్ ప్లస్ లేదా కస్టమర్ సర్వీస్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు ని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ : 9833163620, 9007264050 లో సంప్రదించా లని అన్నారు.

## షట్టర్ లిఫ్టింగ్ దొంగతనం కేసులో ఒకరు అరెస్టు



**తూప్రాన్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** తూప్రాన్ పట్టణంలో షట్టర్ లిఫ్టింగ్ దొంగతనాలకు పాల్పడిన నిందితుడినీ అరెస్టు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు. తూప్రాన్ పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న రెండు షట్టర్ దుకాణాల్లో(ఫర్టిలైజర్), (చెప్పుల దుకాణం)లో జరిగిన దొంగతనం కేసులో తూప్రాన్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నీరస్తులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా దిల్సుఖ్నగర్ కు చెందిన కందుల సత్యనారాయణ, హైదరాబాద్, ఇంతకుముందు విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్లు ఉండేవాడని తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించగా, ఇతను ఇతర ప్రాంతాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు. నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో అరెస్టై జైలులో ఉన్న నిందితుడిని తూప్రాన్ పోలీసులు గుర్తించారు. విచారణలో నిందితుడు తూప్రాన్ పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న రెండు షట్టర్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించాడని తెలిపారు. నిందితుడిని నల్గొండ జైలు నుండి మెదక్ కోర్టులో ప్రొడ్యూస్ చేయగా, కోర్టు ఆదేశాల మేరకు తిరిగి జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు.

## మోతెలో దంపతుల హత్య కేసులో నిందితునిపై చర్యలు

- ప్రధాన నిందితుడు పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్ డిస్మిస్
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ

**సూర్యాపేట, ఆగస్టు 22 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్‌ను పోలీస్ ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తూ జిల్లా ఎస్పీ కె.నరసింహ ఉత్తర్వులు జారీ చేశారు.మోతె మండల కేంద్రంలోని ఒక వ్యవసాయ భూమిలో పాతిపెట్టిన భార్యాభర్తల మృతదేహాల ఘటనపై మోతె పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో అత్యంత వేగంగా దర్యాప్తు చేపట్టారని అన్నారు.సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరానికి పాల్పడిన నిందితులను పట్టుకుని, వారిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.ఈ దారుణ హత్య ఉదంతంలో మోతె పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షరీఫ్ ప్రధాన నిందితుడిగా తేలడం, అతను ప్రస్తుతం రిమాండ్‌లో ఉండటంతో ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించినట్లు పేర్కొన్నారు.చట్టాన్ని రక్షించాల్సిన స్థానంలో ఉండి ఇటువంటి ఘాతుకానికి ఒడిగట్టడం తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా భావిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ నరసింహ సదరు కానిస్టేబుల్‌ను ఉద్యోగం నుండి తొలగిస్తూ తక్షణ ఆదేశాలు జారీ చేశారు.కేసులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటి సెక్షన్ లు నమోదు చేయడంతో పాటు, డిఎస్పీని కేసు దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు.కేసులో త్వరగా తీర్పు రావడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు పంపుతామని,నేరస్థులకు త్వరగా కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా కంపెంజేశన్ త్వరగా వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా సొంత శాఖకు చెందిన వారైనా సరే ఉపేక్షించేది లేదని, చట్టం ముందు అందరూ సమానులేనని ఈ చర్య ద్వారా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది.

# నేరాల నియంత్రణలో సాంకేతికమే కీలకం

- సాంకేతిక పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించాల్సిందే
- అవినీతి పరులకు చోటివ్వకుండా అంకితభావంతో పనిచేయాలి
- వార్షిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్పష్టీకరణ



న్యాల్‌కల్, ఆగస్టు 21 (జనం సాక్షి) : ప్రధానంగా స్థానిక పోలీస్ స్టేషన్, తెలంగాణ - కర్ణాటక సరిహద్దు ప్రాంతల్లో ఉన్న నేపథ్యంలో.. స్థానిక పోలీస్ యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతో ఉందని, సాంకేతికతోనే వివిధ రకాల నేరాలను కట్టడి చేయవచ్చని, అవినీతి పరులకు ఎంతమాత్రం చోటివ్వకుండా అంకిత భావంతో విధులను నిర్వహిస్తూ.. పోలీసుల పనితీరుకు మరింతగా ప్రజలు, బాధితులు చేరువగా అయ్యేలా దృష్టి సారించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్పష్టం చేశారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా.. న్యాల్ కల్ మండలం, హద్నూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. డిఎస్పి సైదా నాయక్, సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్ లతో కలిసి స్టేషన్ ఆవరణలో పలు మొక్కలను నాటారు. పలు రికార్డులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు, పరిశుభ్రతలను పరిశీలించారు. తనిఖీలో భాగంగా.. ఎస్పీ పోలీస్ సిబ్బందికి సూచనలిస్తూ.. ప్రస్తుత చరణంలో సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి పోలీస్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని, పట్టు సాధించాలని, ఆయా గ్రామ పోలీసులు వారి వారి గ్రామాల్లో అన్ని విషయాలపై అవగాహన, పట్టు కలిగి ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదులతో స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడాలని వారి సమస్యలను పరిష్కారానికి భరోసా కల్పించే విధంగా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తేనే పోలీస్ ల పట్ల ప్రజలకు మరింతగా విశ్వాసం కలుగునుందన్నారు. పోలీసులకు ఏదేని సమస్యలు ఉప్పన్నమైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీస్ స్టేషన్ , స్టేషన్ ఆవరణలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ప్రొటోకాల్ నిబంధన ఏర్పాట్లు, తదితర సౌకర్యాలను మెరుగ్గా సమకూర్చడం పట్ల స్థానిక పోలీస్ సిబ్బందికి ఎస్పి అభినందించారు.

## వినాయక ఉత్సవాల పటిష్ట ఏర్పాట్లు చేయాలి




**శంషాబాద్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు జరిగే వినాయక నిమజ్జనోత్సవాల కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పగడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని శంషాబాద్ జోన్ జోనల్ కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్, జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొని నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, రహదారుల మరమ్మతులు, పారిశు ద్ధ్యం, లైటింగ్, నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, వ్యర్థాల తొలగింపు, విద్యుత్ తీగలు, స్తంభాల తనిఖీలపై అధికారులు సమీక్షించారు. అవసరమైన ఫీల్డ్ తనిఖీలు నిర్వహించి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపీలు రాజేష్, రాహుల్ హెగ్డే, ఏసీపీలు, పోలీస్ అధికారులు, జిఎచ్ఎంసీ ఇంజినీరింగ్, ఎస్డబ్ల్యూఎం, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు, ఉత్సవ నిర్వాహకులు అధికారులకు సహకరించాలని జోనల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.




## ల్యాప్‌టాప్‌లతో ఉద్యోగులను ట్రాక్ చేస్తున్నారా?

### అవన్నీ నిరాధార వార్తలే:టీసీఎస్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తమ సంస్థలో పనిచేసే ఉద్యోగుల ల్యాప్‌టాప్‌లను టీసీఎస్ ట్రాక్ చేస్తోందంటూ వచ్చిన వార్తలు టెక్ రంగంలో కలకలం సృష్టించాయి. దీనిపై తాజాగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) స్పందించింది. అవన్నీ నిరాధార వార్తలని కొట్టిపారేసింది. తాము ఉద్యోగుల వ్యక్తిగత యాక్టివిటీని ట్రాక్ చేయలేదని కంపెనీ స్పష్టం చేసింది. తమ నెట్‌వర్క్ మొత్తం పనితీరును పర్యవేక్షించడం కోసం ఆ మానిటరింగ్ టూల్స్‌ను ల్యాప్ టాప్‌ల్లో ఏర్పాటు చేసినట్లు వివరించింది. అసలేం జరిగిందంటే.. ఉద్యోగులకు ఇచ్చిన ఆఫీసు ల్యాప్‌టాప్‌లలో టీసీఎస్ ప్రత్యేక మానిటరింగ్ సాఫ్ట్‌వేర్‌ను అమర్చినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అది 'డిజిటల్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ మానిటరింగ్ టూల్' అని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఉద్యోగులు ఏయే అప్లికేషన్లు వాడుతున్నారు? వాటిపై ఎంత సమయం గడుపుతున్నారు? వంటి వివరాలను ఈ టూల్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని తెలిపాయి. ఈ వార్తలు నెట్టింట తీవ్ర చర్చకు దారితీయడమే గాక.. టెక్ ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది.

టీసీఎస్ ఏం చెబుతోంది..


ఈ వ్యవహారంపై టీసీఎస్ స్పందించింది. "ఉద్యోగులపై మా సంస్థ నిఘా పెట్టిందంటూ వస్తోన్న వార్తలు నిరాధారం. అవాస్తవం. ల్యాప్‌టాప్‌ల్లో ఉద్యోగుల వ్యక్తిగత యాక్టివిటీని టీసీఎస్ ట్రాక్ చేయట్లేదు. ఉద్యోగుల ప్రైవసీని మేం గౌరవిస్తాం. మా ఉద్యోగులకు భద్రత కల్పించేందుకు, యూజర్లకు మెరుగైన సేవలు అందించేందుకు, మా కంపెనీలోని విస్తృత స్థాయి నెట్‌వర్క్ పనితీరును పర్యవేక్షించడానికి మేము వివిధ సాధనాలను ఉపయోగిస్తాం" అని కంపెనీ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.సాధారణంగా సంస్థలు తమ వ్యవస్థలు, పరికరాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవడం కోసం ఇలాంటి టూల్స్‌ను ఉపయోగిస్తాయి. సంస్థకు చెందిన రహస్య సమాచారం బయటకు వెళ్లకుండా అడ్డుకోవడం, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, సైబర్ భద్రతను పెంచడం వంటివి వీటి ముఖ్య ఉద్దేశం. అయితే, తాజా కథనాలతో ఉద్యోగుల వ్యక్తిగత గోప్యతపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాగా.. టెక్ రంగంలో ఉద్యోగులపై డిజిటల్ నిఘా కొత్తేం కాదు. ఇటీవల మెటా తమ ఉద్యోగుల కంప్యూటర్ వినియోగం, కీబోర్డ్ స్ట్రోక్స్, మౌస్ కదలికలను నమోదు చేసే వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో.. డేటా సేకరణను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించింది. ఇక, కొన్ని దేశాల్లో ఈ టూల్స్ గురించి న్యాయపరమైన సమీక్షలు కూడా జరుగుతున్నాయి.




# ఒడుదొడుకుల్లో సూచీలు

**ముంబై(జనంసాక్షి):**
దేశీయ మార్కెట్లు శుక్రవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో పెరుగుతోన్న చమురు ధరలు వంటి కారణాలతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి సెషన్‌లో రోజంతా ఒడుదొడుకులతో సాగిన సూచీలు చివరకు స్తబ్దుగా ముగిశాయి. ఈ ఉదయం 77,701 వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ కాసేపటికి 77,725 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. కానీ, ఆ జోరు ఎంతోసేపు కొనసాగలేదు. కీలక రంగాల్లో మదుపర్లు అమ్మకాలకు దిగడంతో సూచీలు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. ఒక దశలో 77,445 కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు అత్యల్పంగా 3 పాయింట్ల లాభంతో 77,540 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 20 పాయింట్లు పెరిగి 24,252 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 3 పైసలు పెరిగి 95.71 వద్ద ముగిసింది. నిఫ్టీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, నెస్లే, కొటక్ మహీంద్రా బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు స్వల్పంగా లాభపడ్డాయి. మారుతి సుజుకీ, ట్రెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, సిప్లా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ షేర్లు నష్టపోయాయి. రంగాల వారీగా.. లోహ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు జరిగాయి. ఐటీ, ఆటో, మీడియా, ఫార్మా రంగాల షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.
అంతకుముందు ప్రపంచ వ్యాప్తంగా బాండ్ల రాబడులు తగ్గడంతో స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. దీంతో దేశీయ సూచీల ఏడు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ పైసా నష్టపోయి 95.74 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.9% పెరిగి 93.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.71 లక్షల కోట్లు పెరిగి రూ.491.41 లక్షల కోట్ల (5.14 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,909.68 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ 77,611.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 77,371.00 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 628.04 పాయింట్లు లాభపడి 77,537.72 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,265.15 – 24,184.55 పాయింట్ల మధ్య కదలాడింది.సెన్సెక్స్ 30 షేర్లలో 26 లాభపడ్డాయి. ఎటర్నల్ 2.31%, కోటక్ బ్యాంక్ 1.65%, ఐటీసీ 1.63%, బజాజ్ ఫైనాన్స్ 1.53%, యాక్సిస్ బ్యాంక్ 1.46%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.18%, ఇన్ఫోసిస్ 1.18%, పవర్‌గ్రిడ్ 1.07%, ఎల్ అండ్ టీ 1.04%, హెచ్‌యూఎల్ 1.02% పెరిగాయి. టాటా స్టీల్ 0.41%, ఇండిగో 0.24%, హెచ్‌సీఎల్ టెక్ 0.19% తగ్గాయి.
రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి, ఎఫ్ఎంసీజీ, ఫోకస్డ్ ఐటీ, ఐటీ, ఆర్థిక సేవలు, టాప్ 10 బ్యాంక్స్ సూచీలు రాణించాయి. హాస్పిటల్స్ సూచీ డీలా పడింది. బీఎస్‌ఈలో 2,373 షేర్లు సానుకూలంగా, 1,951 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 225 షేర్లలో మార్పు లేదు. ప్రుడెన్షియల్ పీఎల్‌సీ, హెచ్‌సీఎల్ గ్రూప్ నేతృత్వంలోని స్వతంత్ర ఆరోగ్య బీమా సంస్థ ప్రుడెన్షియల్ హెచ్‌సీఎల్ హెల్త్ ఇన్సూరెన్స్ మన దేశంలో కార్యకలాపాలను ప్రారంభించినట్లు గురువారం తెలిపింది. 2026 జులై 1న కంపెనీకి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మంజూరైందని, ఇది ఆరోగ్య బీమా వ్యాపారాన్ని ప్రారంభించడానికి వీలు కల్పించిందని పేర్కొంది. మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం ఎల్ అండ్ టీ, జపాన్‌కు చెందిన మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్‌తో కలిసి దుబాయ్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయ మొదటి దశ కోసం పూర్తిగా డ్రైవర్ రహిత, గ్రేడ్ సెపరేటెడ్ మాస్ ట్రాన్సిట్ వ్యవస్థను రూపకల్పన చేసి, నిర్మించేందుకు ఒక భారీ ఆర్డర్ దక్కించుకున్నట్లు గురువారం తెలిపింది. ఈ ఆర్డర్ విలువ రూ.2,500–5,000 కోట్ల మధ్య ఉంటుంది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు తమ కస్టోడియన్‌లకు డిజిటల్‌గా సంతకం చేసిన పవర్ ఆఫ్ అటార్నీ సమర్పించేందుకు అనుమతించడం ద్వారా వారి ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సులభతరం చేసింది. బిహార్‌లోని మధేపురాలో ఉన్న తన తయారీ ప్లాంట్‌లో 200 లోకోమోటివ్‌లు, ఇతర ఉత్పత్తులు తయారు చేయడానికి భారతీయ రైల్వేతో చర్చలు జరుపుతున్నట్లు ఫ్రెంచ్ రైలు తయారీ సంస్థ ఆల్‌స్టోమ్‌కు చెందిన మధేపురా ఎలక్ట్రిక్ లోకోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఈఎల్‌పీఎల్) ఎండీ వివేక్ గార్గ్ తెలిపారు. టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఐపీఓ తొలిరోజునే 5.93 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 1,51,81,667 షేర్లను ఆఫర్ చేయగా, 8,99,96,050 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 12.50 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 6.44 రెట్లు, సంస్థాగత మదుపర్ల విభాగంలో 5% స్పందన దక్కింది. ఈ నెల 24న ఈ ఐపీఓ ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.285-300.సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల ఐపీఓ ముగిసేసరికి 105.81 రెట్ల స్పందన దక్కింది. కంపెనీ 54,86,051 షేర్లను ఆఫర్ చేయగా 58,04,90,382 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 197.04 రెట్లు, సంస్థాగత మదుపర్ల విభాగంలో 123.52 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 56.60 రెట్ల స్పందన లభించింది. ఈనెల 25న ఈ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో నమోదు కానున్నాయి.






## నివా బూపాపై ఐఆర్‌డీఏఐ ఆంక్షలు

హైదరాబాద్: నిర్వహణ ఖర్చుల పరిమితిని ఉల్లంఘించినందుకు, నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్‌పై భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. రాబోయే ఆరు నెలలపాటు కంపెనీ కొత్త శాఖలు ప్రారంభించకుండా నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఖర్చుల పరిమితి దాటినందుకు నివా బూపా వివరణ ఇవ్వాలనీ ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. నిబంధనలను పాటించకపోవడంపై కంపెనీకి హెచ్చరికలు జారీ చేసింది. దీనిపై నివా బూపా స్పందించింది. తాము 2025–26 పూర్తి ఆర్థిక సంవత్సరంతో పాటు, 2026–27 ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి సంబంధించి ఐఆర్‌డీఏఐ ఖర్చుల పరిమితి, కమిషన్ నిబంధనలకు అనుగుణంగానే ఉన్నామని స్టాక్ మార్కెట్లకు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పరిమితులను కచ్చితంగా పాటిస్తామని తెలిపింది. నియంత్రణ సంస్థ ఆదేశాలను పరిశీలిస్తున్నామని, వాటాదారుల ప్రయోజనాల్ని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## సెప్టెంబర్ నుంచి టాటా కార్లు మరింత ప్రియం

టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్ సంస్థ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కార్లపై రూ.25,000 వరకు ధరలను పెంచనుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఓ ప్రకటనలో ఆ కంపెనీ పేర్కొంది. ద్రవ్యోల్బణ ఒత్తిడి, ముడి పదార్థాల ధరల పెరుగుదల వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది.ఈ పెంపు ఐసీఈ ఇంజిన్, ఎలక్ట్రిక్ వెహికల్స్‌లోని కార్లకు వర్తిస్తుందని పేర్కొంది. కాకపోతే ఎంత పెంపు అనేది మోడల్‌ను బట్టి ఉంటుందని వెల్లడించింది.

# గ్యాస్ కొరతను అధిగమిస్తారా?

## రిలయన్స్ రూ.2.73 లక్షల కోట్ల ఆంధ్రా ప్రాజెక్ట్‌పై అంచనాలు





న్యూఢిల్లీ:ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ (యూసీజీ) సముదాయాన్ని అభివృద్ధి చేసేందుకు రాబోయే 30 ఏళ్లలో రూ.2.73 లక్షల కోట్ల పెట్టుబడిని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ప్రతిపాదించింది. భూగర్భంలో ఉన్న బొగ్గును సింగ్యాస్‌గా మార్చి.. దాని నుంచి హైడ్రోజన్, మెథనాల్, అమ్మోనియా, సింథటిక్ నేచురల్ గ్యాస్ తయారు చేయొచ్చన్నది ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదన. ఇది సాకారమైతే, మనదేశం దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జీపై ఆధారపడటం కొంత తగ్గే అవకాశం ఉందని ఆంగ్లపత్రిక ఎకనామిక్ టైమ్స్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి, రేచర్ల బొగ్గు బ్లాకులను బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఇ-వేలం ద్వారా రిలయన్స్ దక్కించుకుంది. అక్కడ సమగ్ర యూసీజీ సముదాయాన్ని అభివృద్ధి చేయాలని సంస్థ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు మనుగడ సాంకేతికంగా, వాణిజ్యపరంగా సాధ్యమేనా అన్నది పరిశీలనలో తేలాకే, కార్యాచరణకు సంస్థ దిగనుంది.2026 మూడో త్రైమాసికం నుంచి 2027 నాలుగో త్రైమాసికం వరకు: అన్వేషణ, పైలట్ ప్రాజెక్టులకు రూ.3,000 కోట్ల వరకు వెచ్చిస్తారు.
ఇది విజయవంతం అయితే 2028–30 వరకు: ప్రాజెక్టు అభివృద్ధికి రూ.1.2 లక్షల కోట్లు వ్యయం చేస్తారు. ఉత్పత్తి దశలో రూ.1.5 లక్షల కోట్లు పెట్టుబడి పెడతారు. ఈ రెండు బొగ్గు బ్లాకులు చాలా పెద్దవి. చింతలపూడి వద్ద సుమారు 3,000 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో బి–12 గ్రేడ్‌కు చెందిన సుమారు 904.94 మిలియన్ టన్నుల బొగ్గు ఉందని అంచనా. రేచర్ల బ్లాక్ సుమారు 5,500 ఎకరాల్లో ఉంది. ఇందులో బి–13 గ్రేడ్‌కు చెందిన సుమారు 2,225.67 మిలియన్ టన్నుల బొగ్గు ఉన్నట్లు అంచనా. రెండింటినీ కలిపితే సుమారు 313 కోట్ల టన్నుల బొగ్గు ఉంటుంది. ఈ బొగ్గు నిల్వలు భూమికి అర కిలోమీటర్ కంటే ఎక్కువ లోతులో ఉన్నాయని అధికారులు తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో బొగ్గును తవ్వి బయటకు తీసుకురాకుండా.. భూగర్భంలోని బొగ్గు పొరనే గ్యాసిఫికేషన్ రియాక్టర్‌గా ఉపయోగించడం ఈ ప్రాజెక్టులో కీలకాంశం.భూగర్భ బొగ్గు పొరల్లోకి బావులు తవ్వుతారు. ఒక బావి ద్వారా గాలి, ఆక్సిజన్ లేదా ఆవిరి వంటి ఆక్సీకరణ పదార్థాన్ని పంపిస్తారు. బొగ్గు కొంతవరకు దహనం చెంది, భూగర్భంలోనే వివిధ రసాయన చర్యలు జరుగుతాయి. ఇలా ఏర్పడిన గ్యాస్‌ను మరో బావి ద్వారా భూమి పైకి తెస్తారు. దీనినే సింగ్యాస్ అంటారు. ఇది సహజ వాయువుతో సమానం కాదు. ఇందులో హైడ్రోజన్, కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు మీథేన్, కార్బన్ డయాక్సైడ్ ఉంటాయి.సింగ్యాస్‌ను ఉపయోగించి హైడ్రోజన్, మెథనాల్, అమ్మోనియా, సింథటిక్ నేచురల్ గ్యాస్, సింథటిక్ ఇంధనాలు తయారు చేయొచ్చు.ఎరువుల తయారీలో, ఉక్కు పరిశ్రమలో రెడ్యూసింగ్ గ్యాస్‌గా కూడా దీనిని ఉపయోగించొచ్చు. మన దేశ గ్యాస్ అవసరాల్లో సగం మేర, యూరియాలో సుమారు 20%, అమ్మోనియా దాదాపు మొత్తం, మెథనాల్ అవసరాల్లో సుమారు 80% పైగా దిగుమతులే తీరుస్తున్నాయి.

ఇక్కడ ఎంత ఉత్పత్తి చేయొచ్చు

రిలయన్స్ సంవత్సరానికి ఎంత సింగ్యాస్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందో ఇంకా వెల్లడించలేదు. అయతే 313 కోట్ల టన్నుల భూగర్భ బొగ్గును 30 సంవత్సరాల్లో సమానంగా గ్యాసిఫై చేస్తే, సంవత్సరానికి సగటున సుమారు 104 మిలియన్ టన్నుల బొగ్గు అవుతుంది. ఇది 2030 నాటికి మన?దేశం పెట్టుకున్న మొత్తం 100 మిలియన్ టన్నుల జాతీయ గ్యాసిఫికేషన్ లక్ష్యానికి దాదాపు సమానం.

## 80 బి.డాలర్ల విదేశీ కరెన్సీ రావొచ్చు

### ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అంచనా



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూపాయి క్షీణతను నివారించి, విదేశీ కరెన్సీని ముఖ్యంగా డాలర్లను ఆకర్షించేందుకు తీసుకున్న చర్యలు ఫలితాన్నిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. విదేశీ కరెన్సీ రూపంలో దేశంలోకి అంచనాలకు మించి డిపాజిట్లు గడువులోపు వస్తాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్లు, విదేశీ రుణాల రూపంలో ఇప్పటికే 56.85 బిలియన్ డాలర్లు (సుమారు రూ.5.40 లక్షల కోట్లు) తరలి వచ్చాయని ఆయన తెలిపారు. ఈ డిపాజిట్లకు ఇస్తున్న ఆఫర్ గడువు ఈ నెలాఖరు వరకు ఉన్నందున, అప్పటికి కనీసం 80 బి.డాలర్లు (దాదాపు రూ.7.84 లక్షల కోట్లు) రావొచ్చని ఆయన అంచనా వేస్తున్నారు. రూపాయి క్షీణతను అడ్డుకోవడానికి ప్రకటించిన చర్యల ద్వారా, ఎంత మేర నిధులు వస్తాయన్న విషయంలో ఆర్‌బీఐ ఒక సంఖ్యను పేర్కొనడం ఇదే తొలిసారి. దేశీయ బ్యాంకులు ఫారెన్ కరెన్సీ డిపాజిట్లను ఆకర్షణీయ వడ్డీ రేట్లకు స్వీకరించడానికి ఆర్‌బీఐ జూన్‌లో అనుమతినిచ్చింది. 'ఆగస్టు 13 వరకు ఎఫ్‌సీఎన్ఆర్(బీ) కింద 52.3 బి.డాలర్లను ఈ ఒక్క పథకం కిందే రాబట్టుకోగలిగాం. విదేశీ కరెన్సీ రుణాలు, విదేశీ వాణిజ్య రుణాలూ కలిపితే మొత్తం విదేశీ కరెన్సీ విలువ 56.85 బి.డాలర్లకు చేరుకుంది. దీంతో రూపాయి సెంటిమెంటు మెరుగుకానుంద'ని అంచనా వేశారు.

## స్మార్ట్‌ఫోన్ ధరలు తగ్గుతున్నాయ్..

### మెమొరీ, చిప్‌సెట్‌లు పెరగడమే కారణం

### శామ్‌సంగ్, వన్‌ప్లస్, ఒప్పో, వివో, రియల్‌మి కంపెనీలన్నీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
దేశీయ మార్కెట్‌లో స్మార్ట్‌ఫోన్ల ధరలు భగ్గుమంటున్నాయి. స్మార్ట్‌ఫోన్ల తయారీలో కీలకమైన మెమొరీ, చిప్‌సెట్ విడిభాగాల ధరలు భారీగా పెరగడంతో, అగ్రగామి తయారీ సంస్థలన్నీ మొబైల్ ధరలు పెంచుతున్నాయి. ఇప్పటికే రియల్‌మీ, ఒప్పో, వివో, శామ్‌సంగ్, వన్‌ప్లస్ వంటి బ్రాండ్లు ఎంపిక చేసిన మోడళ్ల ధరలు పెంచాయి. ఈ ప్రభావం అమ్మకాలపై పడుతోంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. 2026 ఏప్రిల్–జులై మధ్య స్మార్ట్‌ఫోన్ విక్రయాలు, గతేడాది ఇదే సమయంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. ఆఫర్లు ఉండే ఆన్‌లైన్ ప్రత్యేక విక్రయాల సమయంలో మాత్రమే స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లు కాస్త పుంజుకున్నాయి.
రియల్‌మీ: ఆగస్టు 18 నుంచి పలు మోడళ్లపై రూ.1000–4000 వరకు ధరలు పెంచింది. ఒప్పో: రెనో, ఏ-సిరీస్ ఫోన్లపై గరిష్ఠంగా రూ.5,000 వరకు పెంచింది. వివో: పలు ప్రాంతాల్లో ఎంపిక చేసిన మోడళ్లపై రూ.500–4,000 వరకు ధరలను సవరించింది. శామ్‌సంగ్: ఎస్–సిరీస్, ఎం–సిరీస్, ఎఫ్–సిరీస్ ఫోన్ల ధరలను పెంచింది. ముఖ్యంగా గెలాక్సీ ఎస్25 వేరియంట్ ధర రూ.12,000 ప్రియమైంది. వన్‌ప్లస్: ఎంపిక చేసిన స్మార్ట్‌ఫోన్లపై రూ.2,000–4,000 వరకు ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది.

మరో 7–10% పెరిగే అవకాశం

మెమొరీ ఖర్చులు పెరగడం వల్ల 2026 రెండో త్రైమాసికం నాటికే స్మార్ట్‌ఫోన్ సగటు ధరలు దాదాపు 15% పెరిగాయని ఐడీసీ ఆసియా పసిఫిక్ రీసెర్చ్ మేనేజర్ ఉపాసన జోషి తెలిపారు. రాబోయే నెలల్లో మొబైల్ విడిభాగాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, స్మార్ట్‌ఫోన్ ధరలు మరో 7–10% పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. కొత్తగా విడుదల అవుతున్న మొబైల్స్ కూడా అధిక ప్రారంభ ధరలతోనే మార్కెట్‌లోకి వస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

పండగ విక్రయాలపైనే కొనుగోలుదార్ల ఆశలు

స్మార్ట్‌ఫోన్ ధరలు భారీగా పెరగడంతో, వినియోగదారులు ఆఫర్ల కోసం ఎదురు చూస్తున్నారు. జులైలో అమెజాన్ ప్రైమ్ డే, ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్స్ వంటి పెద్ద ఆఫర్ల సమయంలోనే మొబైల్ కొనుగోళ్లు జరిగాయి కానీ, మిగతా రోజుల్లో అమ్మకాలు మందగించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాబోయే దసరా, దీపావళి సీజన్లలో బ్యాంక్ ఆఫర్లు, ఈఎంఐలు, కంపెనీ–ఇకామర్స్ సంస్థల ప్రత్యేక రాయితీల ద్వారానే స్మార్ట్‌ఫోన్ మార్కెట్ తిరిగి పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## సొంత ప్లాట్‌ఫామ్‌పైనా ఎన్ఎస్ఈ షేర్ల క్రయవిక్రయాలు!

**దిల్లీ:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) షేర్లు మరో స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదైన తర్వాత, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ప్రత్యేక అనుమతి అవసరం లేకుండానే తన ప్లాట్‌ఫామ్‌పైనా ట్రేడ్ చేయడానికి ఎన్ఎస్ఈ అనుమతించొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఎక్స్ఛేంజ్ ప్రస్తుతం అనుమతించిన ట్రేడ్ నిబంధనల పరిధిలోకే ఈ ప్రక్రియ వస్తుందని పేర్కొన్నాయి. 'ట్రేడ్ చేయడానికి అనుమతి' అనేది లిస్టింగ్ చేయడం లాంటిది కాదు. ఒక నమోదిత కంపెనీ తాను లిస్ట్ అయిన ప్రాథమిక ఎక్స్ఛేంజ్‌కు వెల్లడి, నియమ పాలన బాధ్యతలను కలిగి ఉంటుంది. 'ట్రేడ్ చేయడానికి అనుమతి' నిబంధనతో మదుపర్లు వేరొక ఎక్స్ఛేంజ్‌లోనూ షేర్లు కొనడానికి, అమ్మడానికి సాయపడుతుంది. అనుమతించిన ట్రేడ్ నిబంధన ప్రకారం ఒక ఎక్స్ఛేంజ్, మరొక గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేసిన షేర్లలో ట్రేడింగ్‌ను అనుమతించొచ్చు.

## ఆర్ఎస్ఎస్‌పై ఆంక్షలు విధించాలి

### యూఎస్ కమిషన్

**వాషింగ్టన్:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ త్వరలో అమెరికాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ దేశానికి చెందిన అంతర్జాతీయ మత స్వేచ్ఛా కమిషన్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) ఆర్ఎస్ఎస్‌పై కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్ఎస్ఎస్ నాయకులకు ఉన్నత స్థాయి మర్యాదలు ఇవ్వొద్దని, వారిపై ఆంక్షలు విధించాలని అమెరికా ప్రభుత్వానికి సూచించింది. మైనారిటీలపై దాడులకు ఆర్ఎస్ఎస్ కారణమని ఆరోపించింది. అలాగే ఆర్ఎస్ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశాలు, దౌత్యపరమైన మర్యాదలు ఇవ్వకూడదని వ్యాఖ్యానించింది. యూఎస్‌సీఐఆర్ఎఫ్ ఛైర్మన్ అసిఫ్ మహ్మద్, కమిషనర్ జీన్ మిల్స్ ఈ మేరకు ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్‌లో సభ్యుడని అసిఫ్ మహ్మద్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ అనేది భారీ సంస్థని, దాని అనుబంధ సంస్థలు మతపరమైన మైనారిటీలపై దాడులు చేశాయని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు భారత ప్రభుత్వంతో సంబంధం కలిగి ఉన్నప్పటికీ, వారికి ఉన్నత స్థాయి సమావేశాలతో గానీ, దౌత్య మర్యాదలతో గానీ సత్కరించకూడదని జీన్ మిల్స్ తెలిపారు. దానికి బదులుగా, మత విశ్వాస స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులుగా గుర్తించిన ఆర్ఎస్ఎస్ సభ్యులపై ఆంక్షలు విధించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు.

### ఎవర్‌గ్రాండ్ వ్యవస్థాపకుడికి

## జీవిత ఖైదు

### చైనా గృహ మార్కెట్ కుప్పకూలడానికి కేంద్ర బిందువు ఈ సంస్థే

బీజింగ్: చైనా దిగ్గజ స్థిరాస్తి సంస్థ ఎవర్‌గ్రాండ్ గ్రూప్ పతనం వల్ల, ఆ దేశంలో స్థిరాస్తి విపణి ఎంతలా అతలాకుతలం అయిందో తెలిసిందే. కరోనా లాక్‌డౌన్‌లతో తీవ్ర ఇబ్బందుల పాలైన చైనా ఆర్థిక వ్యవస్థకు ఈ గ్రూప్ వల్ల మరింత నష్టం వాటిల్లింది. ఇపుడా ఆ గ్రూప్ వ్యవస్థాపకుడు జు జియాయిన్ (67)కు చైనా కోర్టు జీవిత ఖైదు విధించింది. ఆయన వ్యక్తిగత ఆస్తులన్నీ జప్తు చేయాలని ఆదేశించింది. ఆయనపై 8.82 బిలియన్ యువాన్‌లు (సుమారు రూ.12,500 కోట్లు), ఎవర్‌గ్రాండ్ గ్రూప్‌నకు చెందిన హెంగ్డా రియల్ ఎస్టేట్‌పై 7 బి. యువాన్‌ల (సుమారు రూ.9955 కోట్లు) అపరాధ రుసుమూ విధించింది. క్రిమినల్ నేరాల కింద చైనా కోర్టు విధించిన అతిపెద్ద కార్పొరేట్ జరిమానాల్లో ఇవీ ఉంటాయని ప్రభుత్వ వార్తా సంస్థ జిన్‌హువా పేర్కొంది. జియాయిన్ రాజకీయ హక్కులనూ కోర్టు రద్దు చేసింది. కార్పొరేట్ ఆస్తుల దుర్వినియోగం, కార్పొరేట్ లంచం ఆరోపణలను ఈ ఏప్రిల్‌లో జు జియాయిన్ అలియాస్ హు కా యాన్ అంగీకరించారు. చట్టవ్యతిరేకంగా ప్రజల డిపాజిట్లను సమీకరించడం, నిధుల సమీకరణ మోసానికి పాల్పడడం, చట్టవ్యతిరేకంగా రుణాల జారీ, మోసపూరితంగా సెక్యూరిటీల జారీ, సునిశిత సమాచారాన్ని చట్టవిరుద్ధంగా బయటకు వెల్లడించడం, కార్పొరేట్ లంచం తదితరాలకు ఆయన పాల్పడ్డట్లు కోర్టు గుర్తించిందని ఆ వార్తా సంస్థ తెలిపింది. నిధులను దుర్వినియోగం చేయడం, ఎవర్‌గ్రాండ్ రియల్ ఎస్టేట్ గ్రూప్ సెక్యూరిటీలను మోసపూరితంగా జారీ చేయడం వంటివీ జరిగాయని తేలింది.చట్టవ్యతిరేక పద్ధతుల్లో ఈ సంస్థ గడించిన లాభాలన్నిటినీ రాబట్టాలని కోర్టు ఆదేశించింది. ఒక వేళ పూర్తి స్థాయిలో రికవరీ జరగని పక్షంలో, ఆ సంస్థ నష్టపరిహారం చెల్లించాలనీ తెలిపింది. కంపెనీకి చెందిన 56 సిబ్బందికీ జైలు శిక్ష విధించారు. అందులో జు ఇద్దరు కుమారులూ ఉన్నారు. వీరందరికీ 22 నెలల నుంచి 18 ఏళ్ల వరకు శిక్ష పడింది. ఆస్తుల జప్తు/అపరాధ రుసుమునూ విధించింది. జు, ఆయనకు చెందిన రెండు కంపెనీల క్రిమినల్ కార్యకలాపాల వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నట్లు కోర్టు అభిప్రాయపడింది. ప్రైవేటు, ప్రభుత్వ హక్కులను వీరు ఉల్లంఘించారని, ప్రభుత్వ అధికార్ల పనితీరును బలహీనపరిచేలా చేశారనీ పేర్కొంది.

**అధిక అప్పులతో ఆకాశానికి.. చివరకు జైలుకు**

గ్రామీణ చైనాలో పుట్టిన జియాయిన్‌ను తన అమ్మమ్మే పెంచింది. చైనా దేశం ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానం పలికిన తొలి రోజుల్లో అంటే 1996లో ఎవర్‌గ్రాండ్ పేరిట ప్రాపర్టీ డెవలప్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. వేగవంతమైన విస్తరణ ప్రణాళికలతో కంపెనీ ఎదిగింది. ఇందుకు భారీ ఎత్తున రుణాలు తీసుకున్నారు. దేశంలో స్థిరాస్తి రంగంలో పెరుగుతున్న రుణాలను అదుపులో పెట్టడానికి చైనీస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు కాస్తా ఈ కంపెనీకి సుడిగుండంలోకి నెట్టాయి.



## ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

**కొండమల్లేపల్లి ఘటన నేపథ్యంలో కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లకు వినతి**

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో చోటుచేసుకున్న ప్రధానోపాధ్యాయురాలి దారుణ హత్య ఘటనను తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) కరీంనగర్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా, యావత్ గురుపరంపరపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ మేరకు గురువారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ ని, కమిషనర్ ఆఫ్ పోలీస్ ని కలిసిన ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల పై దాడులు ఆందోళనకరంగా పెరిగిపోతున్నాయని, క్రమశిక్షణలో భాగంగా గురువు మందలిస్తేనే తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి గొడవకు దిగుతున్నారు. దీనికి తోడు పాఠశాలల పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బెడద కూడా విద్యార్థుల భవిష్యత్తుకు పెనుముప్పుగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ రక్షణ చట్టం తీసుకురావాలని, ప్రతి పాఠశాలను డ్రగ్ -ఫ్రీ స్కూల్ జోన్ గా ప్రకటించి, పాఠశాలల పరిసరాల్లో జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో పాఠశాలలు వెంటనే సంప్రదించేందుకు ప్రత్యేక ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టం ను ఏర్పాటు చేసి, పాఠశాల వేళల్లో క్రమం తప్పకుండా పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అలాగే, ఉపాధ్యాయులు, పాఠశాలల పై సోషల్ మీడియాలో తప్పుడు, పరువునష్టం కలిగించే ప్రచారం చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు భయం లేకుండా, గౌరవంగా విధులు నిర్వర్తించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని ఆయన తెలిపారు. తమ విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్ ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా కరీంనగర్ జిల్లా నాయకులు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, జిల్లా అధ్యక్షులు కోరం సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పచ్చునూరి సురేందర్, నగర అధ్యక్షులు రాహుల్ నరేష్, నగర కార్యదర్శి బొమ్మ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బండ శ్రీకాంత్, సభ్యులు ఎస్. రాజయ్య, ఇ. బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మారని ఏపీఎం తీరు.?

**సమయపాలన గాలికి.. విధుల పట్ల నిర్లక్ష్యంపై విమర్శలు**

**ధారూర్,ఆగస్టు21(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సమయపాలన ప్రశ్నార్థకంగా మారింది.విధులకు హాజరు విషయంలో ఏపీఎం (సహాయ ప్రాజెక్టు మేనేజర్) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.దీనిపై సమాచారం అందుకున్న విలేకరి శుక్రవారం ఉదయం కార్యాలయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించగా..విధుల పట్ల అధికారుల తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయి.ప్రభుత్వ కార్యాలయాల పనివేళల ప్రకారం ఉదయం నిర్ణీత సమయానికి విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారి..మధ్యాహ్నం సమయం సమీపిస్తున్నా కార్యాలయంలో కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే మహిళా సంఘాల సభ్యులు,ప్రజలు అధికారుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫోన్ చేసినా స్పందన కరువు**

ఏపీఎం కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో సమాచారం కోసం ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫోన్ ఎత్తడం లేదు.దీంతో విధుల పట్ల బాధ్యత ఎంతవరకు ఉందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.కార్యాలయానికి అధికారిని ఎప్పుడు వస్తారు.?ప్రజలకు సేవలు అందించేందుకు ఎవరు బాధ్యత వహిస్తారు.?అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన,ప్రజలకు అందుబాటు విషయంలో అధికారులు కచ్చితమైన నిబంధనలు పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారనే ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని,నిర్లక్ష్యం నిజమైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ధారూర్ మండలంలో ఇప్పటివరకు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కార్యాలయాలను తనిఖీని చేయకపోవడంతో అధికారులు ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నానీ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

## మర్రి వృక్షానికి 200 సంవత్సరాల చరిత్ర



**ఆకట్టుకునే ప్రకృతి.. అలివినాడు ఆధ్యాత్మికత**

**పర్యాటక గుర్తింపు కోసం కొత్తపల్లి 'మహా మర్రి' నిరీక్షణ!**

**నవాబుపేట్ (జనంసాక్షి) :** పచ్చని పొలాల మధ్య శతాబ్దాల సాక్షిగా నిలిచిన కొత్తపల్లి మహావృక్షంఅది నవాబుపేట మండలానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లి గ్రామం. ఆ ఊరి పొలిమేరల్లోకి అడుగుపెట్టగానే కంటి నిండా పచ్చదనమే పలకరిస్తుంది. నింగిని తాకుతున్నట్లున్న చింత చెట్ల , గాలికి అలల్లా ఊగుతున్న వరిచేలు ఆ ప్రాంతానికే ఒక కొత్త అందాన్ని తెచ్చిపెట్టాయి. ఆ పచ్చని పంట పొలాల మధ్యలో, ఒక నిశ్శబ్ద సామ్రాజ్యాన్ని ఏలుతున్నట్లుగా కొలువై ఉంది ఆ మహా మర్రి వృక్షం.సుమారు రెండు వందల సంవత్సరాలకు పైబడిన ఘన చరిత్ర ఈ వృక్షానికి సొంతం. తరాలు మారుతున్నా, మనుషులు మారుతున్నా, కాలం కరిగిపోతున్నా... తాను మాత్రం చెరగని జ్ఞాపకమై అక్కడే నిలిచింది. ఊడలు నేలకు దిగి, ఒకదానికొకటి అల్లుకుంటూ దాదాపు మూడు ఎకరాల భూ విస్తీర్ణంలో ఈ చెట్టు విస్తరించి ఉందని గ్రామస్తులు ఎంతో గర్వంగా చెప్పుకుంటారు. ఆ దారి వెంట వెళ్లే బాటసారులు ఎవరైనా సరే, ఈ వృక్ష రాజ్యాన్ని చూడకుండా ముందుకు సాగలేరు. ఎంతటి బిజీగా ఉన్నవారైనా ఒక్క క్షణం ఆగి, ఆ చెట్టు అందించే చల్లని గాలిని ఆస్వాదించాల్సిందే. కనుచూపు మేరలో పరుచుకున్న వరి పొలాల మధ్య, ఈ మహా వృక్షం సృష్టించే దృశ్యం చూసే ప్రతి ఒక్కరి మనసును కదిలిస్తుంది.ఈ అద్భుతమైన ప్రకృతి సంపదకు ఆధ్యాత్మికత కూడా తోడైంది. ఈ మహా వృక్షం నీడలోనే భక్తుల పాలిట కొంగుబంగారమైన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ గుడి ఇక్కడి ప్రత్యేకతను మరింత పెంచుతుంది. ప్రతి ఏటా గ్రామస్తులంతా ఒకటై, ఈ ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఆ సమయంలో ఈ మర్రిచెట్టు పరిసరాలన్నీ భక్తి భావంతో, మంగళ వాయిద్యాలతో ఎంతో కోలాహలంగా మారిపోతాయి.అయితే, ఇంతటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న ఈ మహా వృక్షం ఇప్పుడు కొంత ఒంటరితనానికి గురవుతోంది. చుట్టుపక్కల గ్రామాలకు కనివిందు చేస్తున్న ఈ అద్భుతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని గత ప్రభుత్వాలు ఎన్నో హామీలు ఇచ్చాయి. కానీ ఆ మాటలన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఈ పర్యాటక సంపద సరైన గుర్తింపుకు నోచుకోక, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి, పచ్చని ప్రకృతి ఒడిలో ఉన్న ఈ కొత్తపల్లి మహావృక్షాన్ని ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు.

## జాతీయస్థాయి రాకెట్బాల్ పోటీలకు అర్హత

**రాకెట్బాల్ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నది : డా. వి.నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** విద్యార్థులు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, వివిధ క్రీడల పోటీలలో పాల్గొని వారి సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని తద్వారా వారికి ఉపాధి అవకాశాలు చాలా వస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి జాతీయస్థాయి రాకెట్బాల్ పోటీలకు అర్హత సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందినటువంటి రాకెట్బాల్ పోటీలలో పాల్గొనడమే కాకుండా ప్రతిభను చాటాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించినటువంటి ఈ పోటీలలో అసమాన ప్రతిభను చాటి త్వరలో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి పెడతామని, వారికి అన్ని రకాలుగా వనరులు కల్పించి ప్రోత్సాహం అందించడంతో పాటు వివిధ స్థాయిలలో నిర్వహింపబడే వివిధ రకాల పోటీలకు సైతం ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రేరేపించడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రీడ వేగవంతమైన ఇండోర్ క్రీడని, నాలుగు గోడలున్న కోర్టులో ఈ క్రీడను ఆడతారని ఈ క్రీడలో సర్వ్, రిటర్న్ షాట్, ప్లేస్మెంట్, ఫోటో వర్క్, ముఖ్యమైన నైపుణ్యాలని అమెరికాలో ఈ క్రీడకు చాలా ఆదరణ ఉన్నదని ఇతర దేశాలలో క్రమంగా ప్రాచుర్యం పొందుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా శివారులో గల ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించినటువంటి అంతర్ జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి నాగ విగ్నేష్, 9వ తరగతి, అసమాన ప్రతిభను కనబరిచి త్వరలో తమిళనాడులో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణమంటే భయమేనా?



**అమీర్‌పేట్ (జనంసాక్షి) :** ఆర్టీసీ బస్సు అంటే సురక్షితమైన ప్రయాణానికి మారుపేరుగా భావిస్తారు. అయితే నగరంలో నడుస్తున్న కొన్ని ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మలుపులు, కూడళ్లు, సిగ్నల్స్ వద్ద కూడా వేగాన్ని తగ్గించకుండా బస్సులు నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతి వేగంతో ఒక్కసారిగా బ్రేకులు వేయడం, ముందున్న వాహనాలను వేగంగా ఓవర్‌టేక్ చేయడం, మలుపుల వద్ద కూడా నియంత్రణ లేకుండా బస్సులను నడపడం వల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్న డ్రైవర్లలో సగానికి పైగా ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉండటం కూడా గమనార్హమని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నగర రోడ్లపై ట్రాఫిక్ పరిస్థితులు, కీలక మలుపులు, రద్దీ ప్రాంతాలపై పూర్తి అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ అధికారులు ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్ల డ్రైవింగ్ తీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించి, వేగ నియంత్రణపై కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. సీసీ కెమెరాలు, స్పీడ్ గవర్నర్ల ద్వారా డ్రైవర్ల వేగాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన ఆర్టీసీ బస్సులు.. ర్యాష్ డ్రైవింగ్ కారణంగా భయానికి కారణం కాకూడదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

## నేడు నిజామాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన

**ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నిజామాబాద్ లో పర్యటించనున్నారు. ఉదయం 7.00 గంటలకు నాగారంలోని నిర్మితి కేంద్రం వద్ద హౌసింగ్ టవర్స్ నిర్మాణం కోసం స్థల పరిశీలన జరపనున్నారు. అనంతరం 43వ డివిజన్ పాములబస్తీలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి, లబ్దిదారులతో భేటీ కానున్నారు. ఉదయం 10.00 గంటలకు రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు పత్రాలను పంపిణీ చేయనున్నారు. అక్కడి నుండి గూపన్ పల్లికి చేరుకొని తహసిల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అదేవిధంగా దుబ్బ ప్రాంతంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)కు చేరుకుని హౌసింగ్, రెవెన్యూ అంశాలపై నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అంతకుముందు మంత్రి పర్యటించనున్న ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్ తదితరులు ఉన్నారు.



## ఎత్తైన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకం

**ఖిల్లా రామాలయ ఆవరణలో**

**భూమిపూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21 జనం సాక్షి :** ఇందూరు: చారిత్రాత్మకమైన ఖిల్లా రామాలయంలో ఎత్తయిన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర కూట రాజులు నిర్మించి, చత్రపతి శివాజీ మహారాజ్ గురువు సమర్థ రామదాసు అభివృద్ధి చేసిన ఖిల్లా రామాలయంలో 101 అడుగుల ధర్మ ధ్వజాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ధర్మ కార్యానికి హిందువులంతా ఏకమవ్వాలన్నారు. నగరవాసులందరికీ కనపడేలా ఎత్తైన ధ్వజాన్ని ప్రతిష్టించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుప్రసాద్, కార్యదర్శి మారయ్య గౌడ్, మాజీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, కోశాధికారి వాసు, గంట లింగం, హిందూ సంస్థల ప్రతినిధులు నరేష్, ప్రవీణ్, సూరి, సంతోష్, సాయిరాం, సాయి, సందీప్, బీజేపీ కార్పొరేటర్లు, వీహెచ్ పీ, భజరంగ్ దళ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు, పారిశుధ్య లోపాలపై ఎంఎంసి కమిషనర్ సీరియస్

- కాప్రా సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ.. నిర్లక్ష్యంపై అధికారులకు హెచ్చరిక
- ప్రజలకు మెరుగైన పౌర సేవలే లక్ష్యం : ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో కమలా నగర్, మహేష్‌నగర్ కాలనీలలో ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించిన ఆయన పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ, పట్టణ హరితీకరణ అంశాలను పరిశీలించారు.

రోడ్డు మార్జిన్లు, ఖాళీ స్థలాలు, ప్రజా ప్రదేశాల్లో చెత్త పేరుకుపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రహదారులపై అనధికారికంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు, ఫ్లెక్సీలు, అక్రమ ప్రకటనలను తొలగించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత ఎస్ఎఫ్ఏ వంశీ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, ఆయన్ను ప్రస్తుత ప్రాంతం నుంచి మార్చాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. గతంలో అదే ప్రాంతంలో ఇన్‌చార్జ్‌గా పనిచేసిన అంజలిని అక్కడ నియమించాలని సూచించారు.



**హాస్టల్‌లో పార్కింగ్ ఉల్లంఘన**

కమలా నగర్ రోడ్ నంబర్--3లోని నిఖిల్ బాయ్స్ హాస్టల్‌ను పరిశీలించిన సందర్భంగా పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి కిచెన్, కార్యాలయ గదులు నిర్మించినట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అయ్యప్ప స్వామి ఆలయ రోడ్డులో స్కూల్ వాహనాలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న పరిస్థితిని గమనించిన కమిషనర్, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన ఇంజినీరింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు.

**ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం**

రాధికా మల్టీప్లెక్స్ సమీపంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు, రహదారిపై నిర్మాణ సామగ్రి నిల్వపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమ బాధ్యతలను జవాబుదారీతనంతో నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలకు పరిశుభ్రమైన పరిసరాలు, ఆక్రమణలు లేని రహదారులు, సురక్షిత రాకపోకలు, మెరుగైన పౌర సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీంద్ర సాగర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యం, రెవెన్యూ యూబిడి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గుడికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ



**మల్యాల ఆగస్టు 21 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ సమీపంలో వేముల దీపిక అనే మహిళ శుక్రవారం వరలక్ష్మీ పర్వదినం సందర్భంగా మధ్యాహ్నం తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి గుడికి వెళ్లి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండడానికి గమనించి ఆందోళనకు గురై వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం కూడా తెరిచి ఉండడాన్ని చూసి బీరువాలోని దాదాపు 3 తులాల బంగారు ఆభరణాలు,1 లక్ష రూ నగదు దొంగలు అపహరించినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన స్థానానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

**అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల**

## పిడిఎస్ బియ్యం పట్టివేత



**హయత్‌నగర్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యనగర్ కాలనీకి చెందిన అంగోతు లక్ష్మణ్ (52) తన రూమ్‌లో సుమారు 42 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. శుక్రవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి అంగోతు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హయత్ నగర్ ఎస్ హెచ్ ఓ శంకర్ తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మెల్యే..

- పత్తాలేని సూపరిండెంట్..
- సమయ పాలన పాటించని వైనం..
- షాద్ నగర్ ప్రభుత్వసుపత్రి వైద్యుల తీరు మారదా?






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం నాడు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేశారు.ఎమ్మెల్యే రోగులకు పండ్ల పంపిణీ చేసే కార్యక్రమంలో ఉండాల్సిన ఆస్పత్రి సూపరిడెంట్, మరియు వైద్యులు ఎవరు కూడా కనిపించలేదు సుమారు ఆసుపత్రిలోనే గంట సేపు గడిపారు ఎమ్మెల్యే 9 గంటలకు రావాల్సిన వైద్యాధికారులు 10 గంటలవుతున్న వైద్యులు విధులకు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే హాస్పత్రికి వచ్చిన ఎవరు అందుబాటులో లేకపోవడం ఏంటనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ఆస్పత్రికి వస్తేనే ఇంత నిర్లక్ష్యం వహిస్తే ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వచ్చే రోగుల పరిస్థితి ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

**సమయ పాలన పాటించని వైనం**

ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవ చేయాల్సిన సిబ్బంది ప్రతిరోజు సమయపాలన పాటించకపోవడం 12:30 కి ఆసుపత్రి నుండి వైద్యులు వైద్య సిబ్బంది వెళ్లిపోతున్నారనే విమర్శలు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి ఇది ఇలా ఉంటే రోజువారిగా విధులకు హాజరు కాకుండా వంతుల వారీగా డాక్టర్లు విధులకు వస్తున్నారనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# శ్రీరమణ సొసైటీలో మల్లారెడ్డి అక్రమాలపై ఆరోపణలు

- డబుల్ రిజిస్ట్రేషన్లతో కోట్ల దందా..?
- భార్య, కుమారుడి పేర్లపై 20 ప్లాట్లంటూ జంగారెడ్డి ఆరోపణలు




**బోడుప్పల్ (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పర్వతాపూర్ పరిధిలోని శ్రీరమణ సొసైటీ వ్యవహారాలు వివాదాస్పదంగా మారాయి. సొసైటీ అధ్యక్షుడు మల్లారెడ్డి పదవిని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని సత్యనారాయణపురం కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలిమినేటి జంగారెడ్డి ఆరోపించారు. ఒకే ప్లాట్‌కు రెండు రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా సభ్యులను ఇబ్బందులకు గురిచేశారని, కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.శుక్రవారం సత్యనారాయణపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సొసైటీ సభ్యులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో జంగారెడ్డి మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న మల్లారెడ్డి తన పదవిని దుర్వినియోగం చేస్తూ పలువురు సభ్యుల ప్లాట్లపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మల్లారెడ్డి తన భార్య, కుమారుడి పేర్లపై సుమారు 20 ప్లాట్లు నమోదు చేయించుకున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఈ ప్లాట్ల వ్యవహారంపై రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సొసైటీలో ఒకే ప్లాట్‌కు డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని జంగారెడ్డి తెలిపారు. దీని వల్ల అసలు ప్లాట్ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సొసైటీ సభ్యత్వ ప్రక్రియను కూడా కొందరి చేతుల్లోనే ఉంచి కొత్త సభ్యులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

**దేవాలయ స్థలానికీ ఎసరు**

సొసైటీ పరిధిలో దేవాలయ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని సైతం అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారని జంగారెడ్డి ఆరోపించారు. భక్తుల విశ్వాసాలకు సంబంధించిన స్థలాన్ని కూడా వదలకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించుకోవడం దారుణమన్నారు. సొసైటీకి సంబంధించిన ఆస్తులు, ప్లాట్ల కేటాయింపులు, సభ్యత్వాలు, రిజిస్ట్రేషన్లు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

గత కొన్నేళ్లుగా జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్లాట్ల కేటాయింపులు, సభ్యత్వాల మంజూరు, సొసైటీ ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జంగారెడ్డి పేర్కొన్నారు. ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీరమణ సొసైటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి, సత్యనారాయణపురం కాలనీ ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి ముత్యం రెడ్డి, గౌరవ సలహాదారు మనోహర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రంగారెడ్డితో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జీపీ కార్యదర్శి



**జన్నారం, ఆగస్టు 21 (జనంసాక్షి) :** జన్నారం మండలంలోని లింగాయపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇంటి నిర్మాణ అనుమతి కోసం ఓ వ్యక్తి నుంచి రూ.11 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేసి కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతి కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో దాడి చేసి కార్యదర్శిని పట్టుకున్నారు. ఈ ఘటనతో లింగాయపల్లి గ్రామ పంచాయతీలో కలకలం రేగింది. లంచం వ్యవహారంపై ఏసీబీ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

# రిజిస్ట్రేషన్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి

- జీవో 118 పునరుద్ధరించి కన్వేయన్స్ డీడ్స్ అందించాలి
- 22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి
- త్వరలో కార్యాచరణ ప్రకటిస్తాం
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** గత కొంతకాలంగా రిజిస్ట్రేషన్ల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కాలనీ వాసులకు తక్షణ ఉపశమనం కల్పించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.118ను పునరుద్ధరించి, అర్హులైన లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్స్ అందించడంతో పాటు 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. మూడు సంవత్సరాలుగా ఓపిక పట్టామని, ఇకపై సమస్య పరిష్కారం కోసం ప్రజల తరపున మరింత ఉద్ధృతంగా పోరాటం చేస్తామని సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు.

**15 ఏళ్ల పోరాటం తర్వాత వచ్చిన జీవో 118**

స్థానిక ప్రజల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించేందుకు దాదాపు 15 సంవత్సరాలుగా ప్రజలు పోరాటం చేశారని, ఆ పోరాటాల ఫలితంగానే జీవో నెం.118 వెలువడిందని సుధీర్ రెడ్డి తెలిపారు. అయితే అనంతరం ప్రభుత్వం మారడంతో జీవో అమలు నిలిచిపోయిందని ఆయన ఆరోపించారు. జీవో 118ను అమలు చేయడం ద్వారా అర్హులైన ప్రజలకు వారి ఆస్తులపై చట్టబద్ధమైన హక్కులు మరింత స్పష్టంగా లభించే అవకాశం ఉందని, ముఖ్యంగా చాలా కాలంగా నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల కొత్తగా ఎలాంటి జీవోలు తీసుకురావాల్సిన అవసరం లేదని, గతంలో ప్రజల పోరాటంతో సాధించుకున్న జీవో 118నే పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 118ను కొందరు కాంగ్రెస్ నాయకులు ఫేక్ జీవో గా పేర్కొంటూ విమర్శలు చేయడాన్ని సుధీర్ రెడ్డి తప్పుబట్టారు.

**22ఏ నిషేధిత జాబితాపైనా ఆందోళన**

రిజిస్ట్రేషన్ల సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటిగా పేర్కొంటున్న సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాపై కూడా సుధీర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సాధారణ ప్రజలు తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ప్రజల ఆస్తి హక్కులు, రిజిస్ట్రేషన్ హక్కులు, ఆస్తుల బదలాయింపు వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు. రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం కోసం తాను పలుమార్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను కలిసి సమస్యను వివరించినట్లు సుధీర్ రెడ్డి తెలిపారు.



# కర్ణాటక మద్యం అక్రమ రవాణా

- 55 బాటిళ్లు స్వాధీనం

**అమీర్‌పేట (జనంసాక్షి) :** నగరంలోని ఎస్ఆర్‌నగర్ సమీపంలో కర్ణాటకకు చెందిన ప్రీమియం, డిఫెన్స్ మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.1.50 లక్షల విలువైన 55 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం.. కె. గోవర్ధన్‌రెడ్డి (46) కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి హైదరాబాద్‌లో అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 వరకు లాభం పొందుతున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించాలి

- సెప్టెంబరులోగా ప్రక్రియ ప్రారంభించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- తెలంగాణ కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ

**ముషీరాబాద్ ఆగస్టు 21 (జనం సాక్షి):** కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని రైతు ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సుందర విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ జి. హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ 2023లో కౌలు రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, అప్పట్లో రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దాదాపు మూడేళ్లు గడిచినా హామీ అమలు కాకపోవడం విచారకరమన్నారు. కౌలు రైతులు ఆందోళన చేపడితే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు మాట్లాడుతూ భూ యజమాని ఇ్యూ పై ఆధారపడే విధానం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సబ్సిడీ యూరియా, పంట కొనుగోలు కేంద్రాలు సహా అనేక ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 సాగుదారుల చట్టం ప్రకారం సాగుదారు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్, కోదండరాం తదితరులు కౌలు రైతుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. కౌలు రైతుల గుర్తింపునకు రాజకీయ నిర్ణయం తీసుకుని తక్షణమే ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. కమిటీ కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే 15 జిల్లాల్లో కౌలు రైతుల సమావేశాలు నిర్వహించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సెప్టెంబర్ రెండో వారం నాటికి గుర్తింపు ప్రక్రియ ప్రారంభించకపోతే రాష్ట్రస్థాయి ధర్నా చేపడతామని కన్నెగంటి రవి ప్రకటించారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు పశ్య పద్మ, టి. సాగర్, జక్కుల వెంకటయ్య తదితరులు పాల్గొని కౌలు రైతుల డిమాండ్లకు మద్దతు ప్రకటించారు.

# మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**కరీంనగర్, క్రైమ్ ఆగస్టు 21 ( జనంసాక్షి ) :** పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మానకొండూరు మండలం శ్రీనివాస్ నగర్ గ్రామానికి చెందిన వరికుప్పల రాజశేఖర్ అనునతడు తన యజమాని అయిన వరికుప్పల తిరుపతి ఆదేశాల మేరకు, మరియు మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గాలిపల్లి గణేష్ అను అతడు తన యజమాని అయిన పిట్టల కృష్ణ ఆదేశాల మేరకు మానేరువాగు నుండి ఇసుకను దొంగలించి తమ ట్రాక్టర్లను నింపుకొని రవాణా చేస్తుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు గుంటూరు పల్లి స్టేజి, బొమ్మకల్ గ్రామం వద్ద పట్టుకున్నారు మరియు కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి గ్రామానికి చెందిన బిజిలి శ్రీనివాస్ అనునతడు మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి తన యొక్క ట్రాక్టర్లో కరీంనగర్ వైపునకు రవాణా చేస్తుండగా గోపాలపూర్ ఎక్స్ రోడ్, దుర్షేడ్ గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు, అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి నిందుతులపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించడం జరిగినది, మరియు ఎవరైనా అక్రమ ఇసుక రవాణా కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.







## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి**

**వలిగొండ, ఆగస్టు 21 (జనం సాక్షి) :** మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎలాంటి అనుమతులు లేకుండా మోటకొండూరు నుంచి పులిగిల్లకు, మూసీ నది నుంచి సంగెం గ్రామానికి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.


# రెండు ఇసుక ట్రిప్పర్లు, ఒక ట్రాక్టర్ పట్టివేత



**మాగనూర్ (జనం సాక్షి) :** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను ఒక ట్రాక్టర్ ను శుక్రవారం రోజు వేరు వేరు ప్రాంతంలో పట్టుకున్నట్లు మాగనూరు పోలీసులు తెలిపారు. వివరాలు ఓబులాపురం గేటు దగ్గర పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా ఓబులాపురం వైపు నుంచి రెండు టిప్పర్ లు ఇసుక లోడుతో వస్తుండగా ఆపి అనుమతి పత్రాలు చూపించాలని కోరరన్నారు. ఒక టిప్పర్ నెంబర్ టీజీ 06 టీ 2294 ఓనర్ మైనుద్దీన్, మరియు రెండవ టిప్పర్ నెంబర్ కే ఏ 33 ఏ 8247 ఓనర్ ఉప్పర్ సంజీవ్ మరియు ఒక ట్రాక్టర్ నెంబర్ ఏపీ 22 0013 గల పుంజనూర్ ఆంజనేయులు డ్రైవర్ లు ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో టిప్పర్ లను ఒక ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కి తరలించి డ్రైవరు ఓనర్లపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

# బీసీ మహిళలకు ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్లు

- ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషీన్ పథకంకు దరఖాస్తుల ఆహ్వానం
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 1,000 యూనిట్లు
- సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- బీసీ సంక్షేమ శాఖ అధికారి ఝాన్సీరాణి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** బీసీ మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం "ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషీన్ పథకం-2026-27"ను అమలు చేస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణి తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. ఒక్కో కుట్టు మిషన్ యూనిట్ విలువ రూ.12 వేలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పైలట్ ప్రాతిపదికన ఒక్కో నియోజకవర్గానికి 1,000 యూనిట్ల చొప్పున పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

**అర్హతలు ఇవే..**

బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. పేద, నిరుపేద, నిరాశ్రయ, ఒంటరి మహిళలు, వితంతువులు, అనాథ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు తప్పనిసరి కాగా, అవి లేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించకూడదన్నారు. 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, ఆధార్ లేదా ఓటర్ ఐడీ తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. టైలరింగ్ నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన పక్షంలో కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేయబడుతుందని స్పష్టం చేశారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు**

అర్హులైన మహిళలు టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయస్సు నిర్ధారణ పత్రాలతో దరఖాస్తు సమర్పించాలన్నారు. 2023--24లో ఇదే తరహా పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాదని తెలిపారు.

**సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సెప్టెంబర్ 15, 2026లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేసినట్లు ఝాన్సీరాణి తెలిపారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

Happy Anniversary
జనంసాక్షి 16వ వార్షికోత్సవం
ప్రత్యేక అనుబంధం
జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22 ఆగస్టు 2026


## రాజకీయ కక్షతోనే పర్యటనను అడ్డుకున్నారు : మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్, (జనంసాక్షి) :ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు ౘ యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. కేంద్రం కావాలని సిఎం పర్యటనను అడ్డుకున్న బీజేపీ ఎంపీలు రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్‌లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను తీసుకురావడం, విద్యా రంగంలో పెట్టుబడులు, అత్యుత్తమ విద్యా సంస్థల భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడం వంటి అంశాలపై చర్చించాలన్నది సీఎం లక్ష్యమని పేర్కొన్నారు.

## కాళేశ్వరం నీటితో చెరువులు నింపాలి : బిఆర్ఎస్

**యాదాద్రి, ఆగస్ట్ 21(జనంసాక్షి) :**వర్షాభావంతో ఎండిపోతున్న పంటలను ఆదుకునేందుకు ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను కాళేశ్వరం జలాలతో నింపి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాపేట మండలం బొందుగులలో ఎండిపోయిన పంట పొలాలు, చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పంటలు ఎండిపోతున్నాయన్న సమాచారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించగా, నాట్లు వేసిన 25 రోజులకే పంటలు ఎండిపోతున్న దుస్థితి కనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 50 నుంచి 60 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, మరో 100 ఎకరాల వరకు పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని చూసి గుండె తరుక్కుపోయిందన్నారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా పాడిపంటలతో కళకళలాడిందని అన్నారు. గత ఏడాది ఆలేరు నియోజకవర్గంలో 1,000 చెరువులు నింపామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారని, ప్రస్తుతం వర్షాలు లేక చెరువులు, బోర్లు, బావులు ఎండిపోతున్నా చెరువులు నింపాలనే సోయి ఎందుకు లేదని ప్రశ్నించారు. తక్షణమే కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నింపి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తపాస్‌పల్లి జలాలతో బొందుగుల చెరువును నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ, విదేశీ పర్యటనలు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మాజీ ఎంపీపీ బాలమణి యాదగిరిగౌడ్, జల సాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జశ్వంత్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు, ఉపసర్పంచ్ యండి అబీద్, నాయకులు గుండెగోని శీను, రాంగోపాల్‌రెడ్డి, వరిమడ్ల బాలకృష్ణ, స్వామి, నిమ్మల సుదర్శన్, బోయిని రాజు, మాపు భాస్కర్ పాల్గొన్నారు.





- 20కి పైగా నల్లాలు.. కానీ ఒక్క నల్లా కూడా ఉపయోగం లేదు
- వంట మనుషులు లేక విద్యార్థులే వడ్డించుకునే పరిస్థితి

# హాస్టల్లో టైంకి ఫుడ్ లేదు

## హాస్టల్ వార్డెన్ సమయపాలన పాటించట్లేదు



**కౌడిపల్లి ఆగస్టు 21,(జనంసాక్షి) :** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టట్లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు మెనూ ప్రకారం అందించాల్సిన ఆహారశీ అరకొరగా అందిస్తూ ప్రభుత్వానికి ఆదా చేస్తున్నట్టు వ్యవహరిస్తున్నారు. 180 కి పైగా విద్యార్థులు ఉన్న వసతి గృహంలో వంట మనుషులు ఇద్దరు. కామటీలు ఇద్దరు, నలుగురితో మాత్రమే హాస్టల్ నడుపుతున్న వార్డెన్ జయరాజు, రాష్ట్ర ప్రభుత్వం చదువుకునే విద్యార్థుల పట్ల ఎక్కడ తగ్గకుండా నేటి బాలలే దేశాన్ని తీర్చిదిద్దే రేపటి పౌరులు అంటూ ప్రభుత్వం తరపున రావాల్సిన నాణ్యమైన భోజనాన్ని, దుస్తువులను, మరి ఇతర వస్తువులను కోట్ల రూపాయలు వెచ్చించి విద్యార్థులకు అందజేస్తుంటే ఇక్కడ మాత్రం కొంతమంది వార్డెన్లు, అవేమీ మాకు పట్టదు అన్నట్టుగా వార్డెన్ జయరాజ్ తీరుపై విద్యార్థులు తీవ్ర స్థాయిలో అటు తల్లిదండ్రులకు చెప్పుకోలేక ఇటు టీచర్స్ కు చెప్పుకోలేక లోలోపల కృంగిపోతున్నారు. గత నలభై రోజుల నుండి విద్యార్థులకు భోజనం సమయానికి పెట్టక విద్యార్థులు స్కూల్ కి వెళ్లడానికి లేట్ అవుతున్న తరుణంలో టీచర్లు ఆరా తీయగా విద్యార్థులు హాస్టల్లో భోజనం సమయానికి పెట్టట్లేదు టీచర్ అంటూ బదులివ్వడంతో టీచర్స్ కూడా వార్డెన్ జయరాజ్ కి ఫోన్ ద్వారా విద్యార్థులకు సమయానికి భోజనం అందించలని కోరిన కూడా వార్డెన్ జయరాజ్ పనితీరు మాత్రం ఏమాత్రం మారట్లేదు అంటూ విద్యార్థులు వాపోతున్నారు. ఇదే విషయంపై జనం సాక్షి విలేకర్ ( నాగరాజు ) వార్డెన్ జయరాజు ని వివరణ కోరగా హాస్టల్లో ఉన్న ప్రతి సమస్యని వెతికి చూపగా పొంతనలేని సమాధానాలు ఇస్తున్నాడు. అదే రోజు వంట మనసులు లేక కామటిలతో వంట చేయిస్తున్న వైనం ఇదేమిటని అడగగా వంట మనుషులకు ఆరోగ్యం బాగా లేదంటూ హితవు పలికాడు. ఒకవైపు విద్యార్థులే ప్రతిరోజు హాస్టల్ వార్డెన్ సమయపాలన పాటించక మాకు తిప్పలు అంటూ వాపోతుంటే ఆయన మాత్రం దర్జాగా 10 తర్వాత హాస్టల్ కి చేరుకుని హాస్టల్లో స్టాఫ్ అందరు వచ్చారా లేదా అంటూ చెక్ చేస్తే మేం ఇంకే సమయానికి వెళ్తాం స్కూల్ కు అంటూ విద్యార్థులు వాపోతున్నారు. వార్డెన్ వచ్చిన పది పదిహేను నిమిషాలకే వంట మనిషి కూడా వచ్చాడు. ఇది ప్రతి రోజు ఇలాగే కొనసాగుతుందంటూ విద్యార్థుల ఆవేదన ఇది... జయరాజు పనితీరు. ఇప్పటికైనా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.







## కాగ్నా బ్రిడ్జిపై దెబ్బతిన్న రహదారి

### తక్షణ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు బిఎస్ఆర్ ఆదేశం



**తాండూరు అగస్టు 21(జనంసాక్షి) :** తాండూరు – కొడంగల్ ప్రధాన రహదారిలోని కాగ్నా నది బ్రిడ్జిపై దెబ్బతిన్న రహదారిని ఆర్టీఓపీఎల్ సీఈఓ, కాంగ్రెస్ నేత బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జిపై రహదారి పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని శ్రీనివాస్ రెడ్డి హుటాహుటిన బ్రిడ్జి వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అక్కడే ఆర్ అండ్ బి అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగించే కాగ్నా బ్రిడ్జి రహదారి దెబ్బతినడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తాండూరు నుంచి మహబూబ్ నగర్, కొడంగల్, పరిగి వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నాసిరకం పనుల వల్లే రెండేళ్ల క్రితం రూ. 16 కోట్లతో నిర్మించిన ఈ బ్రిడ్జి మళ్లీ మళ్లీ దెబ్బతింటోందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాహనదారుల భద్రతే తమ ప్రాధాన్యత అని, రహదారి మరమ్మతులు పూర్తయ్యే వరకు తాత్కాలిక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను సూచించినట్లు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### అత్యాచారం కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష

**అడ్డాకుల, ఆగస్టు 21 ( జనం సాక్షి):** అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మహబూబ్నగర్ నాల్గవ అదనపు జిల్లా సేషన్స్ కమ్ ఉమెన్స్ కోర్టు గురువారం తీర్పు వెలువరించింది అడ్డాకుల గ్రామానికి చెందిన మద్ది కరుణాకర్ 25 సంవత్సరాల పై 2023లో అడ్డాకుల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి మోహద్ అఫ్రోజ్ అక్తర్ శిక్ష విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు.




## శేరిలింగంపల్లి అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

**శేరిలింగంపల్లి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆయా డివిజన్లలో అనేక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన లింక్ రోడ్లు మరియు నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై మాదాపూర్ లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం శుక్రవారం చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్న మరియు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ట్రాఫిక్ కష్టాల నుండి గట్టెక్కించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ రహదారుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా అధికారులకు సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. మసీదు బండ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విస్తరణలో స్థలాలు, భవనాలు కోల్పోతున్నవారికి సముచిత న్యాయం జరిగేలా చూడా లని, వారి జీవనాధారం కోల్పోవడం జరుగుతుంది కావున అందరికీ సమ న్యాయం చేయాలని, టీడీఆర్ ప్రక్రియ ను వేగవంతం చేయాలని అధికారులను కోరారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370